

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...





Contact Number
9059328777



రంగారెడ్డి శనివారం 23-05-2026 సంపుటి: 02 సంచిక : 23 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Saturday, 23-05-2026 Volume :02 Issue: 23 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani


## రైతు గోస పట్టదా?

**కల్లాల్లోనే చనిపోతున్నా పంట కొనరా?**

**సర్కార్‌ను నిలదీసిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత**

- ధాన్యం కొనుగోలు చేయాలని సచివాలయం వద్ద టీఆర్ఎస్ ధర్నా
- అక్కడే బైఠాయించిన కవిత
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- అరెస్ట్ చేసి ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్‌కు తరలింపు



హైదరాబాద్, మే 22 : (నేటి దర్శిని)
ప్రభుత్వానికి రైతు గోస పట్టదా? మండుతున్న ఎండలతో వడదెబ్బకు గురై కల్లాల్లోనే రైతన్నలు ఊపిరి వదులుతున్నా పంటలు కొనుగోలు చేయరా? అంటూ తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత సర్కార్‌ను నిలదీశారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ -మిగతా 2 లో



## గల్ఫ్‌లో ఉన్న వారి ఓట్లు పోకుండా చూస్తాం

- కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా కలుస్తాం
- బీఎల్‌పల సహకారంతో అందరి ఓటు హక్కును కాపాడతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


హైదరాబాద్ మే 22 : (నేటి దర్శిని)
సర్ పేరుతో గల్ఫ్‌లో ఉన్న తెలంగాణ వారి ఓట్లు పోకుండా చూస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) అన్నారు. బీఆర్ఎస్ తరఫున నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ) సహకారంతో ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడుతామని చెప్పారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో పార్టీ సమీక్ష సమావేశాన్ని శుక్రవారం హైదరాబాద్ కేటీఆర్
-మిగతా 2 లో




## కాక్రోచ్‌పై అక్కసు..

- సీజేపీకి చెక్ పెట్టేందుకు హిట్ జనతా పార్టీతో ట్రోలింగ్
- సామాజిక మాధ్యమాల్లో 'బొద్దింక' వ్యతిరేక శక్తుల యుద్ధం

న్యూఢిల్లీ,
రాత్రికి రాత్రే సోషల్ మీడియాలో పుట్టుకు వచ్చి దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి వస్తున్న ఆదరణను చూసి దేశంలోని పలు పార్టీలు ఉలిక్కిపడుతున్నాయి. నిరుద్యోగ యువతను ఉద్దేశించి ఇటీవల సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పుట్టుకొచ్చిన ఈ పార్టీని ఇప్పటికే లక్షలాది మంది అనుసరిస్తున్నారు. సీజేపీకి పెరుగుతున్న ఆదరణకు బ్రేక్ వేయడానికి తాజాగా 'హిట్ జనతా పార్టీ' పేరుతో డిజిటల్ వేదికపైకి ట్రోలింగ్ మొదలైంది. బొద్దింకలను చంపే ప్రసిద్ధ బ్రాండ్ 'హిట్' స్ప్రే పేరుని ఆధారంగా చేసుకుని ఏఐ సాయంతో దీని పోస్టర్‌ను డిజైన్ చేశారు. ఈ పోస్టర్‌లో హిట్ స్ప్రే రసాయనం ధాటికి ఒక బొద్దింక గిలగిలా కొట్టుకుని చచ్చి పడిపోయినట్టుగా చూపించారు. పోస్టర్‌పై 'హిట్ జనతా పార్టీ' అని రాసి, కింద త్రివర్ణ పతాక రంగుల సర్కిల్‌లో 'స్వచ్ఛ్ ఘర్, సురక్షిత భారత్' అనే నినాదాన్ని -మిగతా 2 లో




## ఉప్పల్‌లో సన్‌రైజర్స్ జయభేరి..

**ఆర్‌సీబీపై 55 పరుగుల తేడాతో ఘన విజయం**

- ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, క్లాసెన్ హాఫ్ సెంచరీల విధ్వంసం
- మెరుగైన రన్‌రేట్‌తో క్వాలిఫయర్ 1కు చేరిన ఆర్‌సీబీ, గుజరాత్ టైటాన్స్

న్యూఢిల్లీ మే 22 : (నేటి దర్శిని)
భారీ విజయంతో క్వాలిఫయర్ 1 ఆడాలనుకున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆశలపై ఆర్సీబీ నీళ్లు చల్లింది. ఉప్పల్‌లో 256 పరుగులు ఛేదనలో ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్(44) అదిరే ఆరంభమివ్వగా.. కృనాల్ పాండ్యా(41 నాటౌట్) జతగా పటిదార్(56) కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. సన్‌రైజర్స్ బౌలర్లు గొప్పగా రాణించినా ఆర్సీబీని 165లోపు కట్టడి చేయలేకపోయారు. దాంతో... -మిగతా 2 లో




## భారత్‌లో భానుడి భగభగలు..

- ప్రపంచంలో టాప్-50 వేడి నగరాలు ఇక్కడే
- మధ్య భారత్‌లో వడగాలుల తీవ్రత ఎక్కువ



## పెద్దల ఎన్నికకు.. నగారా!

- 24 రాజ్యసభ స్థానాలకు ఈసీ నోటిఫికేషన్
- ఏపీలో నాలుగు స్థానాలకు ఎన్నిక
- జూన్ 1 నుంచి నామినేషన్ల స్వీకరణ
- 18న పోలింగ్, అదే రోజు కౌంటింగ్

న్యూఢిల్లీ, మే 22 : (నేటి దర్శిని)
దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో ఖాళీ కానున్న 24 రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని 4 స్థానాలతో పాటు గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లో జూన్ 18న పోలింగ్ నిర్వహించనున్నారు. అదేరోజు ఓట్లు లెక్కిస్తారు. జూన్ 1న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీ కాగా జూన్ 9న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. జూన్ 10వ తేదీన నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని వివరించింది. జూన్ 18వ తేదీన ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామంది. అదే రోజు కౌంటింగ్ నిర్వహించి.. ఫలితాన్ని ప్రకటిస్తామని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. గుజరాత్‌లో 4, కర్ణాటకలో 4, మధ్యప్రదేశ్‌లో 3, రాజస్థాన్‌లో 3, జార్ఖండ్‌లో 2 స్థానాలతో పాటు మణిపూర్, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్, మిజోరంలో ఒక్కో -మిగతా 2 లో


# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

**తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతం**

- దేశ సగటు కంటే వేగంగా వృద్ధి రేటు
- పట్టణీకరణతో సేవల రంగానికి భారీ అవకాశాలు
- విద్యార్థుల రుణాలు భవిష్యత్ పెట్టుబడులు
- రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు వడ్డీ లేని రుణాలు
- బ్యాంకర్ల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్ మే 22 : (నేటి దర్శిని)
సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతలను ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ 2047 నాటికి తెలంగాణ మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యమని ప్రకటించారు. ఇందుకోసం ప్రజా ప్రభుత్వం -మిగతా 2 లో






## కండోమ్‌ల ఉత్పత్తిపై యుద్ధ ప్రభావం..


**ధరలు పెరిగే అవకాశం!**



## నేడు యాదగిరిగుట్టకు సీఎం రేవంత్

**వేద పాఠశాలకు భూమిపూజ**


హైదరాబాద్ మే 22 : (నేటి దర్శిని)
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం నాడు యాదగిరిగుట్టలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వేద పాఠశాలకు భూమిపూజ, లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకోనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన షెడ్యూల్ విడుదలైంది. శనివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి
-మిగతా 2 లో



## భారత్, సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం

- సంబంధాలు పెంచుకునేలా కొత్త వేగం అందించడానికి రెడీ
- ఉగ్రవాదం కట్టడికి జాయింట్ వర్కింగ్ గ్రూప్
- ఇది భవిష్యత్ దృష్టితో కూడుకున్న అనుబంధం
- సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోడీ
- భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం- భారత్‌కు మద్దతు : సైప్రస్

న్యూఢిల్లీ :
భారత్, సైప్రస్ తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోడీ వెల్లడించారు. భారత్, సైప్రస్ అనుబంధం కాలపరీక్షలో పదేపదే నిలుస్తూ వచ్చిందని ఆయన తెలిపారు. ఇప్పుడు భారత్-సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుతో ఇరుదేశాల సంబంధాలకు కొత్త ఆశయాలు, కొత్త వేగాన్ని అందించడానికి సిద్ధమయ్యామని చెప్పారు. మే 20 నుంచి భారత పర్యటనలో ఉన్న సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్, శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. ఈ ద్వైపాక్షిక సమావేశం అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో భారత ప్రధాని ప్రసంగించారు.గత దశాబ్ద కాలంలో భారత్‌లోకి సైప్రస్ పెట్టుబడులు
-మిగతా 2 లో



## పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా

- మిగతా వారికి కూడా ఈప్రయోజనం అందవద్దా
- కొందరికే రిజర్వేషన్లు దక్కితే మిగతా ప్రజలు ఏం కాను
- ఇలా అయితే దేశంలో రిజర్వేషన్ల నుంచి బయటపడేనా
- సుప్రీం ధర్మాసనం సంచలన వ్యాఖ్యలు

2

**ఐఎఎస్ తల్లిదండ్రుల పిల్లలకు రిజర్వేషన్లు అవసరమా**

# ఉప్పల్ లో సన్ రైజర్స్ జయభేరి..

మొదటి తరువాయి



హైదరాబాద్ మూడో స్థానానికే పరిమితమైంది. ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్‌కు బౌలర్లు భారీ స్కోర్ సమర్పించుకోగా.. ఆర్సీబీకి ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్(44) అదిరే ఆరంభమిచ్చాడు. శివాంగ్ ఓవర్లో మూడు సిక్సర్లు, ఫోర్‌తో ఏకంగా 23 పరుగులు పిండుకున్నాడు. ప్రమాదకరంగా మారిన అయ్యర్‌ను మలింగ బోల్తా కొట్టించాడు. సిక్సర్‌కు యత్నించిన అయ్యర్ మిడాన్‌లో అభిషేక్ చేతికి చిక్కాడు. కాసేపటికే షకీబ్ ఓవర్లో కవర్స్‌లో ఆడిన విరాట్ కోహ్లీ(15) స్మరణ్ చేతికి చిక్కాడు. దాంతో. పవర్ ప్లేలో ఆర్సీబీ 2 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసింది. కీలక వికెట్లు పడడంతో పడిక్కల్, పటిదార్ ఇన్నింగ్స్ నిర్మించాలనుకున్నారు.
కానీ, పడిక్కల్‌ను ఔట్ చేసి రెండో వికెట్ సాధించాడు మలింగ. ఆ తర్వాత కృనాల్ పాండ్యా(41 నాటౌట్) జతగా పటిదార్(56) .. సన్‌రైజర్స్ క్వాలిఫయర్ 1 అవకాశాల్ని దెబ్బతీయడమే లక్ష్యంగా ఆడాడు. పెద్ద షాట్లకు వెళ్లకుండావికెట్ కాపాడుకుంటూ స్ట్రయిక్ రొటేట్ చేశారు. పార్ట్ టైమ్ బౌలర్ హెడ్ ఓవర్లో పాటిదార్ పెద్ద షాట్ ఆడి బౌండరీ వద్ద చిక్కాడు. 55 పరుగుల తేడాతో సన్‌రైజర్స్ జయభేరి మోగించింది.


**ఇషాన్, క్లాసెన్ దంచేయగా**

క్వాలిఫయర్ 1 పై కన్నేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ టాపార్డర్ విధ్వంసంతో కొండంత స్కోర్ కొట్టింది. ఉప్పల్ స్టేడియంలో అభిషేక్ శర్మ(56) మెరుపు ఆరంభాన్విివ్వగా.. ఇషాన్ కిషన్(79), క్లాసెన్(51) జోడీ తర్థ శతకాలతో ఆర్సీబీ బౌలర్ల భరతం పట్టింది. వీరిద్దరూ శతక భాగస్వామ్యం నెలకొల్పగా.. డెత్ ఓవర్లలో నితీశ్ రెడ్డి(29 నాటౌట్) సిక్సర్లతో రెచ్చిపోగా హైదరాబాద్ ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించి

# భారత్‌లో భానుడి భగభగలు..

**- ప్రపంచంలో టాప్-50 వేడి నగరాలు ఇక్కడే**

**-మధ్య భారత్‌లో వడగాలుల తీవ్రత ఎక్కువ**




**న్యూఢిల్లీ, మే 22:**


భారత్‌లో భానుడి ఉగ్ర రూపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం ఉదయం ఉష్ణోగ్రతలను లెక్కలోకి తీసుకుంటే..ప్రపంచంలోనే టాప్-50 అత్యంత వేడి నగరాలు మొత్తం భారత్‌లోనే ఉన్నాయి. ఒడిశాలోని బాలన్‌గిరిలో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎయిర్‌క్వాలిటీ అండ్ వెదర్ ట్రాకర్ ఏక్యూల్.ఇన్ ఈ గణాంకాలను విడుదల చేసింది. శుక్రవారం ఉదయానికి మహారాష్ట్రలోని చంద్రాపుర్, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.మధ్య భారత్‌లో వడగాలుల తీవ్రత ఎక్కువ

న్యూఢిల్లీ, మే 22: భారత్‌లో భానుడి ఉగ్ర రూపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం ఉదయం ఉష్ణోగ్రతలను లెక్కలోకి తీసుకుంటే..ప్రపంచంలోనే టాప్-50 అత్యంత వేడి నగరాలు మొత్తం భారత్‌లోనే ఉన్నాయి. ఒడిశాలోని బాలన్‌గిరిలో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎయిర్‌క్వాలిటీ అండ్ వెదర్ ట్రాకర్ ఏక్యూల్.ఇన్ ఈ గణాంకాలను విడుదల చేసింది. శుక్రవారం ఉదయానికి మహారాష్ట్రలోని చంద్రాపుర్, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.


# కండోమ్‌ల ఉత్పత్తిపై యుద్ధ ప్రభావం..

ధరలు పెరిగే అవకాశం!

న్యూఢిల్లీ




పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు చివరికి కండోమ్‌ల ఉత్పత్తులపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కండోమ్‌ల ప్రాథమిక నిర్మాణం సహజ రబ్బరు లాటెక్స్‌పై ఆధారపడినప్పటికీ, తుది ఉత్పత్తిని సిద్ధం చేయడానికి చమురు నుంచి సేకరించే మిశ్రమం ఎంతో అవసరం అవుతుంది. ముడి చమురు ధరలు పెరిగిన కారణంగా కండోమ్‌ల తయారీకి అవసరమైన లూబ్రికెంట్లు, సింథటిక్ రబ్బర్, స్టెబిలైజింగ్ కెమికల్స్ వ్యయం పెరుగుతున్నది.కండోమ్‌ల లూబ్రికేషన్ కోసం తయారీదారులు సిలికాన్ ఆయిల్‌పై, ప్యాకేజింగ్ కోసం అల్యూమినియం ఫాయిల్స్, ప్లాస్టిక్ ఫిల్మ్‌లపై అధికంగా ఆధారపడుతుంటారు. వీటి ధరలు పెరిగిన కారణంగా కండోమ్ ఉత్పత్తుల రిటైల్ ధరలను పెంచడం తప్పనిసరి అవుతున్నదని భారత్‌కు చెందిన హెల్త్‌కేర్ కంపెనీ 'మ్యాన్‌కైండ్ ఫార్మా' తెలిపింది. పెరిగిన ముడిసరుకు ఖర్చుల భారాన్ని వినియోగదారులపై మోపడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని కంపెనీ ప్రతినిధులు అంటున్నారు.

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

మొదటి తరువాయి




కృతనిశ్చయంతో పనిచేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ. 9.43 లక్షల కోట్లకు చేరుకోవడం, అడ్వాన్సులు రూ. 12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమని అన్నారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం అద్వితీయ విషయమని వివరించారు. వ్యవసాయ రుణాల విషయంలో లక్ష్యాలను మించి బ్యాంకులు రుణాలు ఇవ్వడం సంతోషకరమని అన్నారు. రూ. 1,65,297 కోట్ల లక్ష్యానికి రూ. 1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయమని చెప్పారు. వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని అన్నారు. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు, అనుబంధ రంగాలకు కిసాన్ క్రెడిట్ కార్డు సహా వివిధ పథకాల ద్వారా బ్యాంకులు అందిస్తున్న మద్దతు అభినందనీయమని చెప్పారు. రాష్ట్రం పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్నదని వివరించారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై మరింత దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో మరింత సానుకూల దృక్పథంతో బ్యాంకులు ముందుకు రావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై ప్రభుత్వం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని తెలిపారు. సమగ్రాభివృద్ధి, రైతు సంక్షేమం, మహిళా సాధికారత, ఉపాధి సృష్టి పట్ల ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధన రంగంపై దృష్టి సారిస్తోందన్నారు. అందులో భాగంగా ప్రజాప్రభుత్వం కూడా సౌరశక్తి విభాగంలో స్థిరమైన ప్రగతి సాధిస్తోందని తెలిపారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని భట్టి సూచించారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాకుండా, రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని ఉపముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ప్రజల డబ్బు అంతా బ్యాంకులకే చేరుతుంది, కాబట్టి ఆ నిధులను ఏయే రంగాల అభివృద్ధికి రుణాలుగా ఇస్తున్నామనేది చాలా ముఖ్యమని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధికి, ఉపాధికి ఏ రంగం ఎక్కువగా దోహదపడుతుందో ఆలోచించి బ్యాంకులు వ్యూహాత్మకంగా రుణాలు అందించాలన్నారు.

### నేడు యాదగిరిగుట్టకు

# సీఎం రేవంత్



**హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం నాడు యాదగిరిగుట్టలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వేద పాఠశాలకు భూమిపూజ, లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకోనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన షెడ్యూల్ విడుదలైంది. శనివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి బయలుదేరుతారు. అనంతరం 9:15 గంటలకు ప్రతిపాదిత వేద పాఠశాల స్థలానికి చేరుకుంటారు. 9:15 నుంచి 9:45 మధ్య వేద పాఠశాలకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొంటారు. సరిగ్గా ఉదయం 9:37 గంటలకు ఎస్ఎల్ఎన్ఎస్‌డీ వేద పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 9:50కు వేద పాఠశాల స్థలం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బయలుదేరుతారు రేవంత్ రెడ్డి. 10 గంటలకు దేవాలయానికి చేరుకుంటారు. 10 నుంచి 10:30 వరకూ స్వామివారిని దర్శించుకుంటారు. 10:30కు ప్రెసిడెన్షియల్ సూట్‌కు బయలుదేరి 10:40కి అక్కడికి చేరుకుంటారు. దయం 10:40 నుంచి 11 గంటల వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్రాంతి తీసుకుంటారు. 11 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11:10కి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం 11:15కు యాదగిరిగుట్ట నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

# రైతు గోస పట్టదా?

మొదటి తరువాయి

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సచివాలయం వద్ద ఆ పార్టీ శ్రేణులు ధర్నాకు దిగారు. సచివాలయం వద్ద పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కవిత, టీఆర్ఎస్ శ్రేణులు ధర్నాకు దిగడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కవితతో పాటు ధర్నా చేస్తున్న ఇతర పార్టీ నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని అక్కడ నుండి నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ లకు తరలించారు.

సర్కారుకు బుద్ధి రావాలని

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రైతుల గోస పట్టని సర్కారుకు బుద్ధి రావాలని సెక్రటేరియట్ ముందు నిరసన చేపట్టామన్నారు. ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన పంటలను కొనుగోలు చేసి వారికి బాసటగా నిలవాలన్న సోయి కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేదంటూ ఫైర్ అయ్యారు. అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, మొక్కలు, పొద్దుతిరుగుడు పువ్వు, జొన్నలను ఆరబెడుతూ కాంటా వేసే వారి కోసం ఎదురు చూస్తున్నారని వివరించారు. తూకంలో తరుగు తీస్తున్నారు. తేమ పేరిట కొనుగోళ్లను ఆలస్యం చేస్తున్నారని కవిత మండిపడ్డారు. ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్ గా చెప్తూ రైతులను మిల్లర్లు మోసం చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడన్నారు. రెండున్నరేళ్లుగా వ్యవసాయ శాఖను సమీక్షించని సీఎం రేవంత్ రెడ్డి ఈ రాష్ట్రానికి పట్టిన దరిద్రమంటూ వ్యాఖ్యానించారు.. ఇప్పటికైనా ముఖ్యమంత్రి బుద్ధి తెచ్చుకుని ప్రత్యక్షంగా కొనుగోలు కేంద్రాలకు వెళ్లి రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఇవాళ సెక్రటేరియట్ ముందు వడ్లు పోసి నిరసన తెలిపాం. ఇది శాంపిల్ మాత్రమే... వానలు పడే లోపే కొనుగోళ్లను పూర్తిచేయకపోతే... తెలంగాణ రక్షణ సేన రంగంలోకి దిగుతుందని, మీ మంత్రులు, ఎమ్మెల్యేలు తెలంగాణలో తిరగలేని పరిస్థితి తెచ్చుకోవద్దని హెచ్చరించారు.

# గల్ఫ్‌లో ఉన్న వారి ఓట్లు పోకుండా చూస్తాం

మొదటి తరువాయి

నిర్వహించారు. పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై ఆయన దిశా నిర్దేశం చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం, సర్ అంశాలపైన పలు సూచనలు చేశారు. నియోజకవర్గాల వారీగా కేటీఆర్‌కు పార్టీ నాయకులు వివరాలను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లా డుతూ జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన తెలంగాణ బిడ్డల ఓటు హక్కును కాపాడేందుకు పార్టీ తరఫున ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు చెప్పారు. త్వరలో రాష్ట్రంలో జరుగుతున్న సర్ విషయంలో లక్షలాది మంది తెలంగాణ ఎన్ఆర్ఐల నుంచి ఆందోళన వ్యక్తమవుతున్నదని అన్నారు. ఈ విషయంలో గల్ఫ్ బాట పట్టిన తెలంగాణ బిడ్డల ఓటు హక్కులు తొలగించకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని పార్టీ తరఫున కలుస్తామని వివరించారు. పార్టీ ప్రతినిధి బృందాన్ని, ఎమ్మెల్యేలు, ఎంపీల బృందాన్ని ఢిల్లీకి పంపనున్నట్టు చెప్పారు. సర్ కోసం నియమించిన బీఎల్ఏల ద్వారా గల్ఫ్ లోని తెలంగాణ బిడ్డల ఓటు హక్కును కాపాడేందుకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వారికి కేటాయించిన బూత్ పరిధిలో గల్ఫ్ ఎన్ఆర్ఐల వివరాలు సేకరించి వారి ఓటు హక్కును ఎన్నికల కమిషన్ తొలగించకుండా సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు.

# పెద్దల ఎన్నికకు..నగారా!

మొదటి తరువాయి

రాజ్యసభ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి.

**ఏపీలో నాలుగు స్థానాలకు...**

వాటితో పాటూ ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. జూన్ 21వ తేదీతో వైసీపీ నుంచి ఎంపికైన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పరిమళ్ నత్వానీ, పిల్లి సుభాష్ చంద్రబోస్‌తో పాటు టీడీపీ నుంచి ఎంపికైన కనకమేడల రవీంద్రకుమార్ పదవీ కాలం ముగియనుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూటమిలోని పార్టీలకు 164 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. దాంతో ఈ నాలుగు రాజ్యసభ స్థానాలు కూటమి కైవసం చేసుకోనుంది.

# భారత్, సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం

మొదటి తరువాయి

దాదాపు రెట్టింపు అయ్యాయని, ఇది ఇరుదేశాల మధ్య పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని నరేంద్ర మోడీ తెలిపారు. ఇటీవల భారత్- యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అనేది రాబోయే రోజుల్లో భారత్ - సైప్రస్‌కు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దీని ఉద్దేశంతో రాబోయే ఐదేళ్లలో పెట్టుబడులను రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని ఇరుదేశాలు పెట్టుకున్నాయని చెప్పారు.

ఈ విభాగాల్లో ఎంఓయూలు

భారత్, సైప్రస్‌ను డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఫిన్‌టెక్ నిర్వహక వ్యవస్థలు, రీసెర్చ్ హబ్స్ వంటి విభాగాలతో ముడిపడిన పలు అవగాహనా ఒప్పందాల(ఎంఓయూ)పై సంతకాలు చేశాయని ప్రధాని వెల్లడించారు. సాంస్కృతిక సహకారాలు, విద్యార్థి మార్పిడి కార్యక్రమాలు, ఉమ్మడి శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడంపైన ఎంఓయూలు కుదిరాయన్నారు. ఇరుదేశాల మధ్య చట్టబద్ధమైన వలసలను ప్రోత్సహించే, అక్రమ వలసలను అరికట్టే ఒప్పందం భారత్‌కు దృఢమైన ఏకాభిప్రాయాన్ని సాధించడంపైన ఫోకస్ పెట్టాలని నిర్ణయించినట్టు మోడీ తెలిపారు. భారత్- సైప్రస్ మధ్య రాకపోకలు సాగించే వృత్తి నిపుణుల హక్కుల పరిరక్షణకు త్వరలోనే ఒక సామాజిక భద్రతా ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని నిర్ణయించామన్నారు.

ఉగ్రవాదం కట్టడికి జాయింట్ వర్కింగ్ గ్రూప్

"ఉగ్రవాదం కట్టడి కోసం ఒక జాయింట్ వర్కింగ్ గ్రూపు ఏర్పాటు చేసే అంశంపై భారత్- సైప్రస్ మధ్య ఎంఓయూ కుదిరింది. తీవ్రవాద భావజాలం, సరిహద్దు ముప్పులను ఎదుర్కోవడానికి ఈ జాయింట్ వర్కింగ్ గ్రూప్ పనిచేస్తుంది. సైబర్ భద్రత, సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధక నెట్‌వర్క్ బలోపేతం, రక్షిత రక్షణ విస్తరణలలోనూ ఇరుదేశాలు కలిసి పనిచేస్తాయి. భారత్, సైప్రస్ మధ్య స్నేహం బలమైనది. ఇది భవిష్యత్ దృష్టితో కూడుకున్నది. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన వంటి విలువలకు కట్టుబడి ఉండాలనే ఉమ్మడి నిబద్ధతపై మా భాగస్వామ్యం ఆధారపడి ఉంది. మేము అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను ప్రధానంగా గౌరవిస్తాం. ఈ సూత్రాలను పరిరక్షించడానికి భారతదేశం కట్టుబడి ఉంది" అని ప్రధాని మోడీ తెలిపారు.

# పదేపదే కొందరికే రిజర్వేషన్లు ఇస్తే ఎలా

న్యూఢిల్లీ,



రిజర్వేషన్లపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది.దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించు కుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబీసీలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్నీ' కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ. 8 లక్షలు దాటిన వారితో పాటు.. ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపీఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి.

# పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయం: ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు





- ఇందిరమ్మ రాజ్యంలో అర్హులందరికీ న్యాయం
- 107 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ
- దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిల్స్ అందజేత

**ఉమ్మడి వరంగల్, మే 22(నేటి దర్శిని బ్యూరో):** ప్రతి పేదవాడికి గౌరవప్రదమైన జీవితం కల్పించాలని లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్ అన్నారు. హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి సమావేశానికి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ వాజ్పాయ్ , కూడాచైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి తో కలిసి వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ప్రభుత్వం తరఫున సంక్షేమ ఫలాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఐనవోలు, హసన్‌పర్తి మండలాలకు చెందిన 107 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే నాగరాజు పంపిణీ చేశారు. సొంత ఇంటి కలతో ఎన్నోఏళ్లుగాఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం న్యాయం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రతి పేదవాడికి గౌరవప్రదమైన జీవితం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అలాగే దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిల్స్ పంపిణీ చేస్తూ, సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. దివ్యాంగులు సమాజంలో స్వయం ఆధారిత జీవితం గడపడానికి అవసరమైన అన్ని విధాల సహకారం ప్రభుత్వం అందిస్తోందన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాల కల్పన కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు మాట్లాడుతూ ప్రజా పాలనలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రతి పేద కుటుంబాన్ని గుర్తించి వారికి అవసరమైన సహాయం అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల నెరవేరుతోందని, ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు కాదు, ఒక కుటుంబ భవిష్యత్తుకు భరోసా అని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా పెట్టుకొని ముందుకు సాగుతోందన్నారు.. సమాజంలో వెనుకబడిన వర్గాలు, మహిళలు, దివ్యాంగులు, బాలికల అభ్యున్నతికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకొని పరిష్కరించే విధానమే ప్రజా పాలన ప్రత్యేకత అని చెప్పారు. బేటీ బచావో - బేటీ పడావో పోస్టర్ ను ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాల్, కూడా చైర్మన్ ఈనగాల వెంకటరామిరెడ్డి ఆవిష్కరించారు. బాలికల రక్షణ, విద్య, సాధికారతపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆడపిల్లల భవిష్యత్తు బలపడితేనే సమాజం బలపడుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తమ కుమార్తెల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతి స్టాల్స్‌ను ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు , కలెక్టర్ చాహత్ వాజ్పాయ్, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి కలిసి సందర్శించారు. వివిధ శాఖల అధికారులు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలుసుకొని ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల గోస

- ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలి
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి



**మిడ్జిల్, మే22 (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** రైతులు ఆరుగాళం కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకోవడానికి ఎంతో కష్టపడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందన్నారు. శుక్రవారం అయన ఓ ప్రకటనలో ప్రభుత్వ తీరును ఎండగట్టారు. సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. మండలాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు తమ ధాన్యాన్ని తరలించిన 50% కూడా కొనుగోలు చేయకపోగ ధాన్యం నాణ్యతా ప్రమాణాల పేరుతో, ఆరబెట్టిన ధాన్యంపై కూడా 'తేమ ఎక్కువ ఉంది' అని సాకు చెబుతూ క్వింటాలుకు 5 నుండి 8 కిలోల వరకు తరుగు తీస్తూ రైతులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీసం త్రాగునీరు, నిలవనీడ లేక రైతులు, కూలీలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాల భయంతో ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు కూడా అందుబాటులో లేవన్నారు. ఒకవేళ ధాన్యం విక్రయించినా, రైతు ఖాతాల్లోకి డబ్బులు ఎప్పుడు జమవుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం సన్న రకం వరిని పండించే రైతులకు క్వింటాకు రూ. 500 అదనపు బోనస్ రైతుల బ్యాంకు ఖాతాల్లో త్వరగా జమ చేయాలన్నారు.

ప్రభుత్వం ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి, అవసరమైనంత మేర గన్నీ బ్యాగులు అందించడంతో పాటు రైతులను వేధించే మిల్లర్లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిజెపి పార్టీ ఆధ్వర్యంలో రైతులను కూడా గట్టుకొని ఆందోళనలను చేస్తామన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో రైతులకు కాంగ్రెస్ దగా


- బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. రాజేశ్వర్



జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.రాజేశ్వర్

**మిడ్జిల్ మే 22, (నేటి దర్శిని ప్రతినిధి):** రైతు పండించిన ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ రాజేశ్వర్ ఒక ప్రకటనలో విమర్శించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం అమ్మకానికి తీసుకువస్తే అధికారులు తాలు అంటూ తూకంలో మోసం చేస్తూ రైతులకు అనేక కొర్రీలు పెడుతున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకువస్తే అక్కడ గన్ని బ్యాగుల కొరత, ఆన్ లోడ్ చేయడానికి లారీల కొరత ఉందని అన్నారు. దాంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయి రైతులు నష్టపోతున్నారని అన్నారు. విక్రయించిన రైతులకు బోనస్ దేవుడెరుగు కానీ అసలు డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపించారు. దాంతో రైతులు దళారులకు అమ్ముకుంటున్నారని ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలో భాగమేనని అన్నారు. కానీ ప్రభుత్వం మాత్రం వేల కొలది క్వింటాళ్ల ధాన్యం కొన్నామని రైతుల ఖాతాలో బోనస్ తో పాటు డబ్బులు జమ చేశామని ప్రకటనలు చేస్తున్నదని అన్నారు. వాస్తవ పరిస్థితి అందుకు బిన్నంగా ఉండడంతో రైతులకు ఆత్మహత్యలే శరణ్యం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు న్యాయం చేయకపోతే బిజెపి ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు

# పోలీసులు వేధిస్తున్నారంటూ ఐజి నీ ఆశ్రయించిన ఖమ్మం మహిళా



దరఖాస్తు.

Date:22/05/2026

శ్రీయుత గౌరవనీయులైన తెలంగాణ రాష్ట్ర డిజీపి గారికి నమస్కరించి వ్రాయునది.

ఆర్య,

నేను అనగా కూరపాటి పద్మజ W/O నాగరాజు, వయసు ;50, కులం: రాజులు, వృత్తి: గృహిణి.
R/O 11-10-8/25/4 రాపర్తి నగర్ కాలనీ ఖమ్మం అర్బన్, ఖమ్మం జిల్లా. నాకు చెందిన దానను.

తమరుకు విన్నవించినది ఏమనగా: నన్ను ఖమ్మం టౌన్ లోని పోలీసులు అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దళపతి భువనేశ్వర్ రాజు అనే మా బంధువు నల్లమోతు కుసుమ w/o వీరబాబు అనే వారి దగ్గర అనే 65 లక్షల రూపాయలు అప్పు తీసుకొని తిరిగి వారికి ఇవ్వలేని పక్షాన వీరిద్దరి మధ్యలో గొడవలు జరుగుతుండగా నేను 65 లక్షల రూపాయలను అతను చెల్లించ లేకపోతే (దళపతి భువనేశ్వర్ రాజు) అట్టి మొత్తాన్ని నేను చెల్లించగలను. ఒకవేళ చెల్లించ లేకపోతే నా యొక్క స్థిరాస్తి అయిన ఏదులాపురం గ్రామంలో నాకున్న 240 గజాల భూమిని షూరిటీగా పెట్టాను. ఆ సమయంలోనే ఆ భూమి కొంత వివాదంలో ఉండగా దానిని పరిష్కరించి వారికి అప్పురూపంలో చెల్లించగలనని వంద రూపాయల కోర్టు బాండ్ పేపర్ పై రాసి ఇవ్వడం జరిగినది.

కానీ ఖమ్మం జిల్లా పోలీసులు ఈ గొడవలో ఇన్వాల్వ్ అయ్యి నన్ను అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారు. 11/05/26 నా డబ్బులు చేయించాల్సిందిగా ఖమ్మం టౌన్ ఏసిపి కార్యాలయం నుండి నన్ను వదులు చేశారు ఇట్టి విషయంపై రాష్ట్ర డిజీపి గారికి 12/05/26 నా ఫిర్యాదు చేయడం జరిగింది. ఆరోజున చంద్రశేఖర్ రెడ్డి ఐపీఎస్ అధికారి గారు ఖమ్మం జిల్లా కమిషనర్ గారితో మాట్లాడినారు. మళ్ళీ తిరిగి ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్ నుండి జ్యోతి ఏఎస్ఐ 087125 74846 ఫోన్ చేసి పోలీస్ స్టేషన్ కు రావాల్సిందిగా నల్లమోతు. కుసుమ నీమీద పిటిషన్ చేసింది, డబ్బులు విషయం పోలీస్ స్టేషన్కు వచ్చి మాట్లాడాల్సిందిగా ఒత్తిడి చేశారు. అర్బన్ సిఐ గారికి ఇట్టి విషయంపై వివరించడం జరిగింది. అయినా ఆ డబ్బులు తిరిగి చెల్లించాల్సిందిగా సూచించారు. మేము ఇయ్యాల్సిన డబ్బులు గురించి పలు పోలీస్ స్టేషన్లకు తిప్పుతూ పలువురు పోలీస్ అధికారులు పిలిచి బెదిరింపులు చేస్తున్నారు గతంలో నాపై కొన్ని కేసులు పెట్టి నన్ను చాలా ఇబ్బందులకు గురి చేశారు చేయని తప్పులకు నన్ను బలి చేశారు. మళ్ళీ నన్ను డబ్బులు విషయంలో మొదట్లో టూ టౌన్ పోలీస్ స్టేషన్, తర్వాత టౌన్ ఏసిపి ఆఫీస్, ఇప్పుడు అర్బన్ పోలీస్ స్టేషన్లో ఇదే పంచాయతీని నన్ను రావాల్సిందిగా సూచిస్తున్నారు. ఇందులో కొంతమంది ప్రవేట్ వ్యక్తులు ఇన్వాల్వ్ అయ్యి నన్ను బెదిరించారు. నేను పిటిషన్ ఇస్తే పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. [illegible] పై తగు విచారణ జరిపి నాకు న్యాయం చేయవలసిందిగా మనవి.

ఇట్లు తమ విధేయురాలు
కూరపాటి పద్మజ
Ph:9396208762



- 65 లక్షల సివిల్ పంచాయతీలో పోలీసు అధికారులు

**ఖమ్మం,మే 22 (నేటి దర్శిని క్రైమ్ న్యూస్):** ఖమ్మం నగరానికి చెందిన ఓ మహిళ ఖమ్మం పోలీసులు తనని వేధిస్తున్నారు అంటూ ఐజి మల్టీ జోన్ వన్ చంద్రశేఖర్ రెడ్డి ఐపీఎస్ అధికారి దగ్గర ఫిర్యాదు చేయడం జరిగినది. బాధితురాలు తెలిపిన వివరాల.. ప్రకారం ఖమ్మం నగరానికి చెందిన నల్లమోతు కుసుమ భర్త వీరబాబులు తనను వేధిస్తున్నారంటూ ఐ.జి ని కలవడం జరిగినది. 2016- 17 సంవత్సరంలో ఏన్కూరు గ్రామానికి చెందిన భువనేశ్వర్ రాజు, వీరబాబులు కలిసి కాంట్రాక్టు వర్కులు నిర్వహించి కాంట్రాక్టు వర్క్ ల బిల్లులు రాక గొడవలు పడుతుండగా భువన్ కుమార్ కు సమీప బంధువైన ఖమ్మం నగరానికి చెందిన మహిళ మధ్యవర్తిత్వం వహించి 2025 సంవత్సరం 65 లక్షల రూపాయలకు గాను షూరిటీగా వందరూపాయల బాండ్ పై భువనేశ్వర్ రాజు చెల్లించకపోతే నేను చెల్లించగలంటూ ఇష్టపూర్తిగా అగ్రిమెంట్ చేసుకోగా సకాలంలో బిల్లును రాక ఇబ్బంది పడే సమయంలో రంగంలో దిగిన సెటిల్మెంట్ బాసు ఓ మినిస్టర్ కొడుకు ద్వారా పలు పోలీస్ స్టేషన్లకు పిలిపించి బాధిత మహిళను





ఇబ్బంది పెడుతూ బాధితురాలిని ఇంట్లో పెట్టి తాళాలు వేసి ఇబ్బందులకు గురిచేసి చంపుతామంటూ బెదిరించినప్పటికీ ఆశ్రయించిన ఫలితం లేదంటూ బాధిత మహిళ వాపోయింది. మే 11 వ తారీకు ఖమ్మం టౌన్ ఏసిపి కార్యాలయంలో పంచాయతీ నిర్వహించగా సదురు మహిళ హాజరు కాకుండా 12వ తారీకు ఐజి సంప్రదించగా ఐజి టౌన్ ఏసిపి తో మాట్లాడి పంపించారు. తిరిగి మళ్లీ అర్బన్ పోలీస్ స్టేషన్లో సదరు మహిళ నల్లమోతు కుసుమ, వీరబాబులు ఫిర్యాదు చేయడంతో మరొకమారు పోలీసులు తనను పోలీస్ స్టేషన్ కి రావాల్సిందిగా సూచించడంతో గత్యంతరం లేక ఐజి సంప్రదించింది. ఇట్టి విషయంపై స్పందించిన ఐజి ఖమ్మం పోలీస్ కమిషనర్ కు సిఫారసు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ స్టేషన్లో సివిల్ పంచాయతీలు నిర్వహించకూడదు: ఆస్తి తగాదాలు, భూ వివాదాల సమస్యలు వంటి సివిల్ వివాదాలను పరిష్కరించే అధికారం పోలీసులకు లేదు. సివిల్ పంచాయితీలు పూర్తిగా కోర్టు పరిధిలోకి వస్తాయి. అయినప్పటికీ, పోలీసులు పోలీస్ స్టేషన్లలో సివిల్ పంచాయితీలు నిర్వహిస్తే అది చట్టవిరుద్ధం. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం, సివిల్ వివాదాలను పరిష్కరించే అధికారం కేవలం సివిల్ కోర్టులకు మాత్రమే ఉంటుంది.

# కరెంటు స్తంభం పడి బాలిక మృతి...



**మాడ్గుల,మే22(నేటి దర్శిని);** కరెంటు స్తంభం పడి బాలిక మృతి చెందిన ఘటన మాడుగుల మండలం పకీరతండా గ్రామపంచాయతీ పరిధిలోని బాలు తండాలో చోటుచేసుకుంది. జటావత్ వైష్ణవి (15) అని బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన శుక్రవారం తండాలో తీవ్రవిషధాన్ని నింపింది. స్థానిక గిరిజనులు తెలిపిన వివరాల ప్రకారం విద్యుత్ సిబ్బంది కరెంటు వైర్లకు అడ్డంగా ఉన్న కొబ్బరి చెట్టును తొలగించే పనులను చేపట్టారు. ఈ క్రమంలోని చెట్టు రెండు విద్యుత్ స్తంభాల మధ్య పడిపోయింది. అదే సమయంలో ఇంట్లో ఉన్న వైష్ణవి బయటకు రావడంతో ఒక్కసారిగా కరెంటు స్తంభం ఆమెపై పడింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలికి తండ్రి చందు,తల్లి సంధ్యతో పాటు మరో ముగ్గురు సోదరీలు ఉన్నట్లు తాండ గిరిజనులు పేర్కొన్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రహదారి ఆక్రమణ నుండి కాపాడాలని సీఐ కి వినతి పత్రం అందజేత....



**తలకొండపల్లి, మే22(నేటి దర్శిని):** రహదారి ఆక్రమణ నుండి కాపాడాలని కోరుతూ శుక్రవారం తలకొండపల్లి మండలం లోని కోరింతకుంట తండా గ్రామపంచాయతీ సర్పంచ్ సీఐ జానకిరామ్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. కోరింతకుంట తండా గ్రామ శివారులో ఉన్న దొంగ రోడ్డు నుండి బోడియ తండ వరకు వెళ్లే రోడ్డును ఇరువైపులా రైతులు ఆక్రమించి ప్రజలను ఆ దారి గుండా వెళ్లేందుకు ఇబ్బందులను గురి చేస్తున్నారు. ఈ కారణంగా గ్రామ ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులకు గురై, అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా రాళ్లు పెట్టి,గేట్లు వేసుకోవడం,ముళ్ళ కంపలను కొట్టి రోడ్డుకు ఇరువైపులా వేయడం జరుగుతుంది. ఇరువైపులా రోడ్డుకు కందకాలు తీసి మట్టిని వేయకుండా అడ్డుకోవడం జరుగుతుందని తండావాసులు ఆరోపిస్తున్నారు. దయచేసి ఆ రోడ్డును పరిశీలించి సమస్యను తీర్చవలసిందిగా తాండ ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్, నరసింహ, బాలు,కుమార్,రమేష్, మల్లేష్,రాములు నాయక్,తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## భరోసా లేని బతుకు



‘ఏద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు కన్నీరు పెట్టిన రాజ్యం” బాగుపడినట్టు చరిత్రలో లేదు. అదే చిత్రం ఇప్పుడు తెలంగాణలో ఆవిష్కృతమవుతోంది. రాష్ట్రాన్ని ఒకప్పుడు “రైతు రాజ్యం”గా ప్రచారం చేశారు. రైతు సంక్షేమ పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు, మద్దతు ధరలు, కొనుగోలు కేంద్రాల హామీలతో వ్యవసాయం బలపడిందని పాలకవర్గాలు చెప్పుకుంటున్నాయి. కానీ, క్షే?త్రస్థాయిలో గ్రామీణ వాస్తవం అందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. దుక్కిదున్నిన రైతు చివరకు అప్పు తీర్చలేక, పండించిన పంట అమ్ముకోలేక, కొనుగోలు కేంద్రాల చుట్టూ తిరిగి మనస్తాపంతో అదే దుక్కిలో ప్రాణాలు తీసుకుంటే -- అది రైతు వైఫల్యం కాదు, ముమ్మాటికీ ప్రభుత్వాలదే. ఇటీవల మెదక్ జిల్లాలో గాయంతి రాజయ్య అనే రైతు ఇరవై రోజులుగా కొను గోలు కేంద్రం వద్ద ధాన్యం అమ్మేందుకు ఎదురుచూసి, డబ్బులు రాక అప్పుల ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. సకాలంలో కొనుగోళ్లు జరిగి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు. సిద్ధిపేట జిల్లా జగదేవ్‌పూర్ ప్రాంతంలో దిగుబడి సరిగా లేక అప్పుల భారంతో మరో రైతు ప్రాణాలు తీసుకున్నాడు. వికారాబాద్‌లో కూడా వ్యవసాయ నష్టాలు, అప్పులు రైతు ఆ కుటుం బాన్ని విషాదంలోకి నెట్టాయి? వీటన్నింటికి కారణాలను విశ్లేషిస్తే కనిపించేదొక్కటే- పాలకవర్గాల ప్రణాళిక లోపం, నిర్లక్ష్యం. పంటవేసిన నుంచి అప్పుల కుంపటి రైతుల నెత్తిన పడుతోంది. ఓవైపు కుటుంబ సమస్యలు, మరోవైపు ప్రకృతీ వైపరీత్యాలు ఇవన్నీ కూడా రైతును నైరాశ్యంలో ముంచుతున్నాయి. పేర్లు ఏవైనా ఆదుకుంటుందని చెప్పిన రైతు బంధు, రైతు భరోసా వారికి భరోసా నివ్వడం లేదు. పైగా చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి వ్యాపారుల నుంచి వేధింపులు ఎక్కువవుతు న్నాయి. ఇవన్నీ రైతులను ఆత్మహత్యలవైపు నెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల విత్తనాలు, ఎరువులు, కూలి ఖర్చులు విపరీ తంగా పెరిగాయి. పంట చేతికొచ్చినా మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉండదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోతే రైతు మధ్యవర్తులపైనే ఆధారపడాల్సి వస్తోంది. సూర్యాపేట జిల్లాలో ధాన్యం కొనుగోలు అవకతవకలపై ఆందోళన చెందిన రైతు ఆత్మహత్యాయత్నం చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధర సంగతి దేవుడెరుగు, కనీసం అమ్ముకోవడం కూడా గగనమైతే వారి పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలి? పంట కోసి నెలరోజులు దాటుతుంటే ఇప్పటి వరకు సగమే కొనుగోలు జరగడం, అధికార యంత్రాంగం అలసత్వాన్ని చూపుతోంది. ఒక దగ్గర గన్నీ సంచుల కొరత, మరోచోట కాంటాల సమస్య, లోడింగ్ బెడద. ఇవన్నీ సమకూర్చ వల్సింది సర్కారే కదా. రైతు నానా తిప్పలు పడి ఈ వేదన భరించలేక తక్కువ ధరకు దళారులకు అమ్ముకుంటున్న దయనీయ స్థితి నెలకొంది. ఎందుకంటే, కల్లాల్లో ధాన్యం ఆరబెట్టి ఉంటే అకాలంలో వర్షం వస్తే అసలుకు మోసం వస్తుంది. అందుకే గిట్టుబాటు ధర రాకున్నా నష్టానికి పంటలు అమ్ముకోవాల్సిన దుస్థితి ప్రభుత్వమే కల్పించింది. ఇంకొంతమంది రైతులు నేటికీ ధాన్యం కుప్పలపైనే పడిగాపులు కాయడం సర్కార్ నిర్లక్ష్య ధోరణే తప్ప వేరే కాదు. ఇన్ని సమస్యలు సవాల్ విసురుతుంటే, రైతులపై ప్రకృతి కూడా కనికరం చూపడం లేదు. అకాల వర్షాలు, వడగళ్ల వాన, పంట నష్టం వారిని మరింత కుంగదీస్తున్నాయి. నల్లగొండ, ఆదిలాబాద్ ప్రాంతాల్లో వర్షాల వల్ల ధాన్యం, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు నివేదికలు తెలిపాయి. పంటపోతే రైతుకు వెంటనే పరిహారం అందడం లేదు. పంట బీమా సకాలంలో రాదు. బీమా కంపెనీలను బతికించడానికే తప్ప రైతు కుటుంబాలను కాదన్న సత్యం రైతులకు ఎప్పుడో అర్థమైంది. కానీ, దాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. దీంతో రైతు సొమ్ము కంపెనీల పరం అన్నట్టుగా ఉంది.

ప్రభుత్వం రైతు సంక్షేమంపై ప్రకటనలు చేస్తోంది. కానీ ఆచరణ కనుచూపు మేరలో లేదు. రైతు మరణించిన తర్వాత ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం సమస్యకు పరిష్కారం కాదు. అతను బతికుండగానే అప్పు ఒత్తిడి నుంచి బయటపడే విధానం కల్పించాలి. ధాన్యం కొనుగోలు ఆలస్యం కాకుండా చూడాలి. పంటకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధర, తక్షణ నష్టపరిహారం, తక్కువ వడ్డీ రుణాలు ఇవ్వాలి. అలాగే రైతులు మనోధైర్యం కోల్పోకుండా గ్రామ స్థాయిలో మానసిక ఆరోగ్య సలహా కేంద్రాలు నెలకొల్పాలి. కానీ, ఇవన్నీ చేయాల్సిన పాలకులు రైతు ఆత్మహత్యను “వ్యక్తిగత కారణం”గా కొట్టిపారేయడం అన్యాయం. ఒక రైతు అప్పుల బాధతో చనిపోతే, అందులో పాలనా నిర్లక్ష్యానికి వాటా కచ్చితంగా ఉంటుంది. ప్రభుత్వ వ్యవస్థ రైతును ఆదుకునే స్థితిలో ఉంటే, రైతు ఉరివేసు కోవాల్సిన పరిస్థితి రాదు. దీన్ని గుర్తెరగాలి. ఇది కేవలం రైతుల సమస్య కాదు. దేశ ఆహారభద్రతకు సంబంధించిన విషయం కూడా. రైతు బతికితేనే సమాజం బతుకుతుంది. కానీ పాలకులు ఎన్నికల సమయంలో మాత్రమే రైతును గుర్తు చేసుకుని, తర్వాత మరచిపోతున్నారు. రైతు చనిపోతే సంతాపం తెలపడం చాలా సులువు. కానీ రైతు ఎందుకు చనిపోతున్నాడో పాలకులు అంగీకరించని అంశం. తెలంగాణ అభివృద్ధి గణాంకాల్లో ఎంతో ఎదిగిందని ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు చెబుతున్నారు. కానీ పొలం దున్నిన రైతు తన పంట అమ్ము కోలేక చనిపోతే, ఆ అభివృద్ధి గణాంకాలు అర్థం లేనివే అవుతాయి. రైతు చనిపోతే అది కుటుంబం కోల్పోయిన జీవితం మాత్రమే కాదు -- సమాజం కోల్పోయిన ఆహార భద్రత కూడా.

# ఢిల్లీలో ఆటోలు, ట్యాక్సీల సమ్మె..

- రూ.100కు చేరిన కొత్తిమీర..
- మండిపోతున్న కూరగాయల ధరలు



**న్యూఢిల్లీ మే 22 : (నేటి దర్శిని)** దేశ రాజధాని ఢిల్లీలో ఎండలతోపాటు కూరగాయల ధరలు కూడా మండిపోతున్నాయి. ఆటోలు, ట్యాక్సీ వాలాలు సమ్మె చేస్తుండటంతో ఈ ప్రభావం కూరగాయలపై పడింది. గురువారం ప్రారంభమైన సమ్మె శుక్ర, శనివారాల్లో కూడా కొనసాగనుంది. ఇటీవల ఢిల్లీ ప్రభుత్వం కమర్షియల్ వాహనాలపై పర్యావరణ సెస్ పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని క్యాబ్‌లు, ఆటోలు, ట్రాలీ యాజమాన్యాలు బంద్ నిర్వహిస్తున్నారు. దీంతో రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో మార్కెట్లో ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఏకంగా హోల్‌సేల్ మార్కెట్లలోనే కూరగాయల ధరలు రెండు, మూడు రెట్లు పెరిగిపోయాయి. ఇంతకుముందు కొత్తిమీర కేజీ రూ.40 ఉండగా, ఇప్పుడు అది రూ.100కు పైగా చేరింది. ఢిల్లీలోని పెద్ద మార్కెట్లలో ఒకటైన ఆజాద్‌పూర్ మండిలో కూడా కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. దీంతో ఢిల్లీ వాసులు కూరగాయలు కొనేందుకు జంకుతున్నారు. సామాన్యుల్ని ఈ ధరలు ఇబ్బంది పెడుతున్నాయి. ప్రస్తుతం ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో కేజీ అల్లం రూ.130, కేజీ నిమ్మకాయలు రూ.100 పలుకుతున్నాయి. అయితే, ఎక్కువ రోజులు నిల్వ చేసుకోగలిగే ఉల్లి, ఆలూ, వెల్లుల్లి వంటి వాటి ధరలు స్వల్పంగా పెరిగినప్పటికీ అందుబాటులో ఉన్నాయి. సమ్మె కారణంగా మార్కెట్లో వీటి రాక కూడా తగ్గిపోయింది. ఇంకా ఒకట్రెండు రోజులకు సరిపడా మాత్రమే కూరగాయల నిల్వ ఉన్నాయని మార్కెట్ వ్యాపారులు చెబుతున్నారు. కూరగాయల ధరలతోపాటు ఢిల్లీ ప్రజలు రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఢిల్లీ ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ రవాణా సౌకర్యాలైన బస్సులు, మెట్రో, లోకల్ ట్రైన్లలోనే ప్రయాణిస్తున్నారు. దీంతో బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో విపరీత రద్దీ నెలకొంది.

# రూపాయి 100కు పడాల్సిందే..!

- డాలర్‌తో క్షీణించనివ్వండి
- నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్
- పనగారియా బాధ్యతా రహిత్య వ్యాఖ్యలపై విమర్శలు



**న్యూఢిల్లీ మే 22 : (నేటి దర్శిని)** అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ రోజురోజుకు రికార్డ్ పతనాన్ని చూస్తోన్న వేళ నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ అరవింద్ పనగారియా రూపాయిని గాలికి వదిలేయండంటూ పరోక్షంగా అత్యంత బాధ్యతా రహిత్య వ్యాఖ్యలు చేశారు. డాలర్‌తో రూపాయి విలువ 100కు తగ్గాల్సిందేనన్నారు. చమురు కొరత స్వల్పకాలికమైనా, దీర్ఘకాలికమైనా రూపాయి విలువ పడేల్సిందేనని ఆర్‌బిఐ పలు సూచనలు చేయడం ఆర్థిక నిపుణులను ఆగ్రహానికి గురి చేస్తోంది. డాలర్‌కు రూ.100 అనేది కేవలం మానసిక భావనే అని పనాగరియా పేర్కొన్నారు. చమురు దిగుమతులు తగ్గగానే తిరిగి రూపాయి పుంజుకోవచ్చన్నారు. రూపాయి విలువ తగ్గితే దిగుమతులకు అయ్యే ఖర్చు పెరగొచ్చని.. అదే సమయంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా రూపాయి విలువ తగ్గడం వల్ల కలిగే నష్టాన్ని భర్తీ చేయొచ్చని పనాగరియా ఎక్స్‌లో పోస్టు చేశారు. “ప్రస్తుత చమురు కొరత కొన్ని నెలల నుంచి ఒక ఏడాది వరకు కొనసాగితే రూపాయి మొదట్లో బలహీనపడుతుంది. కానీ పెట్టుబడిదారులు పెరగడం వల్ల భవిష్యత్తులో భారీగా కోలు కుంటుంది. ఈ చమురు సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే విదేశీ మారక నిల్వలను హరించివేస్తుంది. రూపాయి విలువ తగ్గింపు తప్ప మరే ఇతర మార్గాన్ని అనుసరించినా అది నష్టానికే దారితీస్తుంది. ఈ సమయంలో డాలర్లలో జారీ చేసిన సావరిన్ బాండ్లు లేదా అధిక వడ్డీ ఇచ్చే ఎన్నారై డాలర్ డిపాజిట్లపై ఎక్కువగా ఆధార పడకూడదు.’ అని ఆర్‌బిఐకి16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ గా పని చేసిన అరవింద్ పనగారియా సూచించారు. 2013 నాటి కరెన్సీ సంక్షోభంతో పోలిస్తే ప్రస్తుతం భారతదేశ స్థూల ఆర్థిక పరిస్థితి చాలా బలంగా ఉందని చెప్పకొచ్చారు.

# త్రిభాషా సూత్రంపై సుప్రీంలో పిటిషన్



**న్యూఢిల్లీ మే 22 : (నేటి దర్శిని)** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) తొమ్మిదో తరగతి విద్యార్థులకు మూడు భాషల బోధన (త్రిభాషా సూత్రం)ను తప్పనిసరి చేస్తూ తీసుకువచ్చిన నూతన విద్యా విధానం ఇప్పుడు న్యాయ వివాదానికి దారితీసింది. బోర్డు తీసుకున్న ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల తరఫున దాఖలైన ఈ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ప్రస్తావించారు. విద్యా సంవత్సరం మధ్యలో అకస్మాత్తుగా తొమ్మిదో తరగతి నుంచి మూడు భాషలను తప్పనిసరి చేయడం వల్ల విద్యార్థులపై తీవ్రమైన మానసిక, విద్యాపరమైన భారం పడుతుందని రోహత్గి కోర్టుకు వివరించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విద్యా విధానానికి ఇది పూర్తిగా భిన్నంగా ఉందని, దీనివల్ల అటు విద్యార్థుల్లో, ఇటు విద్యాసంస్థల్లో తీవ్ర గందరగోళం నెలకొందని ఆయన న్యాయమూర్తికి వెల్లడించారు. విద్యార్థులు మూడు భాషలు ఎలా నేర్చుకుంటారని, ఆ తర్వాత పదో తరగతి పరీక్షలు ఎలా రాస్తారని ఆయన కోర్టులో ప్రస్తావించారు. ఈ పిటిషన్‌పై త్వరితగతిన విచారణ జరపాలని ఆయన ధర్మాసనాన్ని అభ్యర్థించారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) సిఫారసుల మేరకు సీబీఎస్ఈ విద్యా చట్రంలో మార్పులు చేస్తూ 9, 10 తరగతుల్లో విద్యార్థులు కచ్చితంగా మూడు భాషలను చదవాలనే నిబంధనను తీసుకువచ్చింది. అయితే, తగిన ముందస్తు ప్రణాళిక లేకుండా, మధ్యలో ఈ నిబంధనను రుద్దడం సమంజసం కాదని పిటిషనర్లు వాదిస్తున్నారు. ఈ వాదనలను పరిశీలించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం వచ్చే వారం సమగ్ర విచారణ జరిపేందుకు అంగీకారం తెలిపింది. త్రిభాషా విధానంపై సీబీఎస్ఈ ఇటీవలే నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయబోతున్నారు. ఇప్పటికే సీబీఎస్ఈ తరగతులు ప్రారంభమైనప్పటికీ.. జూలై 1 నుంచి మూడో భాష బోధన ప్రారంభం కానుంది. ఆర్1, ఆర్2, ఆర్3 కింద త్రిభాషను అమలు చేయనున్నారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ -- 2020, నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ -- 2022 ప్రకారం.. సీబీఎస్ఈ తాజా నిర్ణయం తీసుకుంది. మూడు భాషల్లో రెండు భారతీయ భాషలు తప్పనిసరిగా నేర్చుకోవాలి. మూడోది ఇండియన్ భాష అయినా ఉండొచ్చు.. లేదా విదేశీ భాష అయినా నేర్చుకోవచ్చు. త్రిభాషా విధానం కోసం సీబీఎస్ఈ మొత్తం 42 భాషల్ని ఎంపిక చేసి, వాటికి సంబంధించిన సిలబస్ రూపొందించింది. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో పొందుపర్చిన భాషలు ఏవైనా నేర్చుకోవచ్చు. పదో తరగతిలో వచ్చే ఏడాది త్రిభాషా విధానం అమలు చేస్తారు. అయితే, దీనికి బోర్డ్ ఎగ్జామ్ మాత్రం నిర్వహించరు. ఇంటర్నల్ మార్కుల ఆధారంగా తుది మార్కుల జాబితాలో కలుపుతారు.


# నీట్ లీక్ బాధ్యత ఎవరిది?

- కేంద్రం, ఎన్‌టీఏ ?పరస్పర విరుద్ధ వాదనలు
- లోపాన్ని ఒప్పుకున్న విద్యాశాఖ మంత్రి
- సిస్టమ్ ద్వారా లీక్ జరగలేదన్న ఎన్‌టీఏ చీఫ్
- వేర్వేరు ప్రకటనలతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గందరగోళం




**న్యూఢిల్లీ మే 22 : (నేటి దర్శిని)** నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ వివాదంపై కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వాదనలు పరస్పరం విరుద్ధంగా ఉన్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ‘చైన్ ఆఫ్ కమాండ్‌లో లోపం జరిగిందని అంగీకరించగా.. ఎన్‌టీఏ డీజీ మాత్రం ‘సిస్టమ్(వ్యవస్థ) ద్వారా ప్రశ్న పత్రం లీక్ కాలేదు’ అని అంటున్నారు. ఇప్పుడు ఈ పరస్పర విరుద్ధ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీస్తున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో మరింత గందరగోళాన్ని పెంచుతున్నాయి. దీంతో లీక్ వ్యవ హారంలో అసలు బాధ్యత ఎవరిది? తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయ త్నాలను కేంద్రం, ఎన్‌టీఏలు చేస్తున్నాయా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నీట్ పరీక్ష? ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ప్రతిష్టాత్మక పరీక్ష?ను సమర్థవంతంగా నిర్వహించడంలో కేంద్రం విఫలమైందన్న విమర్శలు సర్వ త్రా వ్యక్తమయ్యాయి. ఇలాంటి పరిస్థి తుల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సైతం తప్పును ఒప్పుకున్నారు. పరీక్ష? నిర్వహణ వ్యవస్థలో లోపం జరిగిందని అంగీకరించారు. అయితే ఎన్‌టీఏ వాదన మాత్రం ఇంకోలా ఉంది. ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ (డీజీ) అభిషేక్‌సింగ్ మాత్రం.. ప్రశ్నపత్రం వ్యవస్థ ద్వారా లీక్ కాలేదని ఈనెల 21న పార్లమెంటరీ కమిటీ ఎదుట చెప్పినట్టు వెల్లడి కావడం గమనార్హం. ?కొన్ని రోజుల క్రితం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ... నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో ‘చైన్ ఆఫ్ కమాండ్‌లో లోపం జరిగింది’ అని స్పష్టంగా చెప్పారు. ప్రభుత్వం దీనిపై బాధ్యత తీసుకుంటోందని కూడా ఆయన తెలిపారు. ఇక్కడే ఇటు ప్రభుత్వం, అటు ఎన్‌టీఏ నుంచి భిన్నవాదనలు వినబడటం అనేక అనుమానాలకు తావిస్తోంది. ‘వ్యవస్థలో లోపం జరిగింది’ అని ప్రభుత్వం చెప్తుంటే.. ఎన్‌టీఏ మాత్రం ‘సిస్టమ్ ద్వారా లీక్ కాలేదు’ అని ఎందుకు చెప్తోంది? అనే ప్రశ్న విద్యార్థులు, తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది. సాధారణంగా ‘సిస్టమ్’ అంటే కేవలం కంప్యూటర్ సర్వర్ లేదా డిజిటల్ నెట్‌వర్క్ మాత్రమే కాదు. ప్రశ్నపత్రాల ముద్రణ, ప్యాకేజింగ్, రవాణా, భద్రపరిచే ప్రక్రియ, పరీక్షా కేంద్రాల నిర్వహణ, భద్రతా పర్యవేక్షణ... ఇవన్నీ కూడా పరీక్షా వ్యవస్థలో భాగమే. ఆ గొలుసు(చైన్)లో ఎక్కడైనా ప్రశ్నపత్రం బయటకు వెళ్తే, అది మొత్తం వ్యవస్థ వైఫల్యంగానే కనిపిస్తుందని విశ్లేషకులు చెప్తున్నారు. అయితే ఇప్పుడు జరుగుతున్న చర్చలో అసలు సమస్య సాంకేతిక పదజాలం కాదని అంటున్నారు. ప్రభుత్వం లోపాన్ని ఒప్పుకోగా.. ఎన్‌టీఏ మాత్రం ‘లీక్’ అనే పదాన్ని తప్పించు కుంటోందని చెప్తున్నారు. ?

# డా.సత్యనారాయణ రెడ్డిని కలిసిన డా. బంగ్లా లక్ష్మికాంత్ రెడ్డి



**మిడ్జిల్, మే 22, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** పాలమూర్ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అవార్డు తీసుకున్న శుభ సందర్భముగా హైదరాబాద్, మాదాపూర్ లోని ఎం.ఎస్.ఎన్ గ్రూప్స్ అఫ్ కంపెనీస్ కార్పొరేట్ కార్యాలయంలో డాక్టర్ ఎం. సత్యనారాయణ రెడ్డి ని కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందించిన విజన్ ఫార్మా కెమ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ డా. బంగ్లా లక్ష్మికాంత్ రెడ్డి

# ప్రజల సంక్షేమం కోసం అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయతో పని చేయాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**ఉమ్మడి వరంగల్, మే 22 ( నేటి దర్శిని బ్యూరో):** ప్రజల సంక్షేమం కోసం అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయముతో ముందుకు సాగాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో వరంగల్ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద, వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్ పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనల కోసం చేపట్టిన అరైవ్ ఆ లైవ్ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన: సిపి సన్ ప్రీత్ సింగ్



**ఉమ్మడి వరంగల్ ,మే 22 ( నేటి దర్శిని బ్యూరో):** ట్రాఫిక్ నిబంధనల అమలు కోసం చేపట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హంటర్ రోడ్ లో వరంగల్ జిల్లా స్థాయి సమావేశంనిర్వహించారు .ఈ సమావేశానికిముఖ్యఅతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించేలా కొన్ని గ్రామాల్లో సొంతంగా తీర్మానాలు చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజలు పాల్గొన్నారు.


# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత: కలెక్టర్




**ఉమ్మడి వరంగల్, మే 22 (నేటి దర్శిని బ్యూరో):** పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుడు బాధ్యత అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం హనుమకొండ లోని వడ్డేపల్లి చెరువు కట్ట వద్ద పర్యాటక శాఖ, జిడబ్ల్యుఎంసీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అవినీతి వలయంలో రాష్ట్ర ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు

- అటెండర్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు అక్రమాల ఆరోపణలు
- సూపర్వైజర్ ఇంటర్వ్యూలు అధికారుల దందా కోసమేనా..?
- గతంలో ఏసీబీ కేసుల్లో చిక్కిన అధికారులపై మళ్లీ విమర్శలు




**హైదరాబాద్ సిటీ,మే22 (నేటి దర్శిని):** తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డులో అవినీతి ఆరోపణలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయని పలువురు ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లు, విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి, అధికారుల ఇష్టారాజ్యంగా వ్యవహారం సాగుతోందని వాపోతున్నారు. లంచం లేకుండా ఫైల్ కదలదనే పరిస్థితి నెలకొన్నదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అటెండర్ స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు అవినీతిలో మునిగిపోయారని కాంట్రాక్టర్లు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం బోర్డు కార్యదర్శిగా ఉన్న అధికారి తాను అడిగిన మేరకు డబ్బులు ఇవ్వకపోతే ఎలక్ట్రికల్ 'ఎా' గ్రేడ్ లైసెన్సులను వివిధ కారణాలు చూపిస్తూ నిలిపివేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల పేరుతో అభ్యర్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అంటున్నారు.

**మారని అధికారుల తీరు**

సీఈఐజీ విభాగంలో పనిచేసిన కొందరు అధికారులపై గతంలో ఏసీబీ దాడులు జరిగినప్పటికీ వారి వ్యవహార శైలిలో మార్పు రాలేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కార్యదర్శిగా పనిచేస్తున్న కాంతారావు గతంలో నిజామాబాద్‌లో ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే సమయంలో ఏసీబీకి పట్టుబడ్డారని కాంట్రాక్టర్లు గుర్తుచేస్తున్నారు. అయినప్పటికీ రాజకీయ, ఉన్నతాధికారుల అండదండలతో మళ్లీ కీలక పదవులు దక్కించుకుంటున్నారని విమర్శిస్తున్నారు. "మేము చెప్పిందే నిబంధన" అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని, ఫిర్యాదులు చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని పలువురు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.

**సూపర్వైజర్ ఇంటర్వ్యూలు.. విద్యార్థుల కోసమా? అధికారుల కోసమా?**

తెలంగాణ ఏర్పడ్డాక తమ భవిష్యత్తు మారుతుందని ఆశించిన టెక్నికల్ విద్యార్థులకు నిరాశే ఎదురవుతోందని అభ్యర్థులు వాపోతున్నారు. బీటెక్(ఈఈఈ) , డిప్లమా(ఈఈఈ) పూర్తి చేసిన విద్యార్థులకు 11కేవీ, 33కేవీ, అన్ని వోల్టేజీల విభాగాల్లో నిర్వహించే ఇంటర్వ్యూల ద్వారా సూపర్వైజర్ సర్టిఫికెట్లు జారీ చేయాల్సి ఉన్నా, నైపుణ్యానికి విలువ లేకుండా డబ్బులకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**విద్యార్థుల వివరాల ప్రకారం..**

11 కేవీ సర్టిఫికెట్‌కు రూ.5,000, 33కేవీ కు రూ.12,000, ఆల్ ఓల్టేజెస్ సర్టిఫికెట్‌కు రూ.60,000 వరకు వసూలు చేస్తున్నారంటున్నారు. నైపుణ్యం ఉన్నా లేకున్నా "చేతులు తడిపితే" సర్టిఫికెట్ ఇస్తారని, డబ్బులు ఇవ్వనివారిని ఇంటర్వ్యూలో ఫెయిల్ చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. సరైన సమాధానాలు చెప్పినా ఉద్దేశపూర్వకంగా తిరస్కరిస్తున్నారని, మళ్లీ ప్రిపేర్ అయి రావాలని మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని చెబుతున్నారు.

**రిటైర్మెంట్‌కు ముందు అందిన కాడికి దోపిడీ..?**

మూడు నెలల్లో రిటైర్మెంట్‌కు చేరుకోనున్న కార్యదర్శి అందిన కాడికి దోచుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఎలక్ట్రికల్ 'ఎా' గ్రేడ్ లైసెన్సులకు వోల్టేజ్ ఆధారంగా రూ.13 వేల నుంచి రూ.17 వేల వరకు వసూలు చేస్తున్నారని అంటున్నారు. లాప్స్ అయిన సూపర్వైజర్ పర్మిట్ల పునరుద్ధరణకు కూడా ఒక్కో పర్మిట్‌కు రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు డిమాండ్ చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. "సూపర్వైజర్ ఇంటర్వ్యూలు విద్యార్థుల భవిష్యత్తు కోసం నిర్వహిస్తున్నారా? లేక అధికారుల అవినీతి కోసం నిర్వహిస్తున్నారా?" అని ప్రశ్నిస్తున్నారు.

**ప్రభుత్వానికి విద్యార్థుల హెచ్చరిక..**

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై ఇప్పటికే పలువురు ప్రజాప్రతినిధులు కూడా విమర్శలు చేసినట్లు విద్యార్థులు గుర్తుచేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ జోక్యం చేసుకుని విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న అధికారులపై చర్యలు తీసుకోకపోతే కార్యాలయం ముందు పెద్దఎత్తున ఆందోళనలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నారు.

# శంకర్ స్వరూప పెళ్లిరోజు సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేసిన అమ్మ ఫౌండేషన్

**వీణవంక, మే22 (నేటి దర్శిని):** కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలకు వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నల్లవెల్లి శంకర్ -- స్వరూప దంపతుల 30వ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సుమారు 250 మంది ఉపాధి హామీ కూలీలకు సల్ల ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సుంకరి శ్రీనివాసరావు తన చేతుల మీదుగా సల్ల ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, శంకర్ -- స్వరూప దంపతులు తమ పెళ్లిరోజు సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు సల్ల ప్యాకెట్లు అందించడం అభినందనీయమన్నారు. గ్రామ ప్రజల సంక్షేమం




కోసం అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపకుడు గోనెల సమ్మన్న ముదిరాజ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శప్రాయమని కొనియాడారు. గ్రామ ప్రజలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్, 9వ వార్డు సభ్యులు గంధం



ప్రశాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ మోరె మహేష్, ఫౌండేషన్ సభ్యులు గుమ్మడి సంపత్, రాయణవేణి సంపత్, పూదరి సమ్మయ్య, గోనెల పెద్ద సమ్మయ్య, గోనెల నర్సయ్య, కర్రె మల్లికార్జున్, గోనెల నడిపి సమ్మయ్య, పూదరి హరీష్, దూలం గోపి, దూలం కనుకయ్య, రాయణవేణి కనుకయ్యతో పాటు ఉపాధి హామీ కూలీలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# శతావధాన విద్య వికాసానికి తెలంగాణ వేదిక కావాలి: డాక్టర్ కె.వి. రమణాచారి

**హైదరాబాద్, మే 22 (నేటి దర్శిని):** సురవరం ప్రతాపరెడ్డి 130వ జయంతిని పురస్కరించుకుని నిర్వహించనున్న శతావధానం కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఈరోజు ఆయన కార్యాలయంలో ఘనంగా జరిగింది. ప్రముఖ అవధాని డాక్టర్ మలుగ అంజయ్య ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఈ నెల 27, 28 తేదీలలో రెండు రోజుల పాటు శతావధానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ కె.వి. రమణాచారి, తెలంగాణలో అవధాన విద్య మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. అష్టావధానాలు, శతావధానాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించబడాలని ఆకాంక్షించారు. శతావధానం అనేది అత్యంత ఏకాగ్రత, నిష్ఠ, శ్రద్ధతో కూడిన మహోన్నత సాహిత్య ప్రక్రియ అని పేర్కొన్న ఆయన, "శతావధానం అంటే సాక్షాత్తు అమ్మవారి చే పలికించేటట్లు భావించి నిర్వహించాలి" అని అన్నారు. డాక్టర్ మలుగ అంజయ్య మరిన్ని శతావధానాలు నిర్వహించి తెలుగు సాహిత్య వైభవాన్ని మరింత పెంపొందించాలని ఆశీర్వదించారు. తెలంగాణలో ప్రతి జిల్లాలోనూ శతావధాన సభలు జరగాలని, అవధాన విద్యకు యువతలో ఆసక్తి పెంపొందించాల్సిన



అవసరం ఉందని ఆయన సూచించారు. ప్రారంభ సభకు తాను హాజరవుతానని కూడా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, విమర్శకులు రామకృష్ణ చంద్రమౌళి, అవధాని అంజయ్య, గంట మనోహర్ రెడ్డి, ప్రముఖ సాహితీవేత్త బి. జయరాములు, గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షులు అర్థ చంద్రప్రకాశ్ రెడ్డి, కార్యక్రమ నిర్వాహకులు పీ. బడే సాబ్ తిక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ ఆధ్వర్యంలో ఘనంగా డ్యాన్స్ పోటీలు




**హైదరాబాద్, మే 22(నేటి దర్శిని):** గ్రేటర్ హైదరాబాద్ వైఎంసీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్యాన్స్ కంపిటీషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వైఎంసీఏ అధ్యక్షుడు జయకర్ డానియల్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ కొరియోగ్రాఫర్లు గబ్బర్ సింగ్ గణేష్ మాస్టర్, గబ్బర్ సింగ్ సాయి, నిక్సన్ మాస్టర్, శేఖర్ మాస్టర్, కపిల్ మాస్టర్, పవన్ కుమార్ సింగ్, చాంప్ మాస్టర్ తదితరులు పాల్గొని చిన్నారుల ప్రతిభను అభినందించారు. వారి నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. My Step Dance & Fitness Studio నిర్వాహకులు మరియు కొరియోగ్రాఫర్ విఘ్నేష్ మాస్టర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. పోటీల్లో పాల్గొన్న చిన్నారులు ఉత్సాహభరితమైన ప్రదర్శనలతో తమ ప్రతిభను చాటుకున్నారు. అనంతరం విజేతలకు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా Pawan Kalyan Ane Nenu పుస్తకావిష్కరణ కూడా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మాస్టర్, గబ్బర్ సింగ్ సాయి పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వం, సేవా భావం, యువతపై ఆయన ప్రభావం గురించి మాట్లాడారు. జనసేన పార్టీ తెలంగాణ అడ్వాక్ కమిటీ సభ్యుడు మరియు BBR World Group Founder భవ్యరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. రచయిత వికాస్ మాట్లాడుతూ పుస్తకావిష్కరణ విజయవంతం కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. డ్యాన్స్, కళలు, స్ఫూర్తిదాయక సందేశాలు, సామాజిక చైతన్యంతో కూడిన ఈ కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టుకుని విజయవంతంగా ముగిసింది.

# సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ప్రజాప్రతినిధుల ఆగ్రహం

● డంపింగ్ యార్డ్ కోసం భూమి కేటాయిస్తే రాజీనామాలకు సిద్ధం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**రంగారెడ్డి, మే 22(నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ ప్రాంతంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కొంగరకలాన్‌లో నిర్వహించిన 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి సమావేశం వేదికగా ఈ అంశం ప్రధాన చర్చనీయాంశంగా మారింది. డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ఎట్టి పరిస్థితుల్లోనూ భూమి కేటాయించవద్దని డిమాండ్ చేస్తూ కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్ ఆధ్వర్యంలో మండల సర్పంచులు జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా అధికారులు నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. స్థానిక ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి డంపింగ్ యార్డ్ కోసం భూమి కేటాయిస్తే తామంతా రాజీనామాలకు కూడా సిద్ధమని హెచ్చరించారు. ప్రజల మనోభావాలను గౌరవిస్తూ ప్రభుత్వం ఈ ప్రతిపాదనపై పునరాలోచన చేయాలని కోరారు. సిద్ధాపూర్ పరిసర ప్రాంతాల ప్రజల ఆరోగ్య భద్రతకు హాని కలిగించే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

# ఫ్యూచర్ సిటీతో తెలంగాణకు గ్లోబల్ పెట్టుబడులు పట్నం మహేందర్ రెడ్డి





**రంగారెడ్డి, మే 22(నేటి దర్శిని):** ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ ప్రపంచ పెట్టుబడిదారులకు స్వర్గధామంగా మారుతుందని, ప్రజా పాలనలో అభివృద్ధి--సంక్షేమం జోడెడ్లలా ముందుకు సాగుతున్నాయని శాసన మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మంచి ఫలితాలు ఇస్తోందని ఆయన అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, ముందుగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి ప్రజలతో కలిసి బీపీ పరీక్ష చేయించుకున్నారు. రాష్ట్ర గీతాలాపనతో ప్రారంభమైన సమావేశంలో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పట్నం మహేందర్ రెడ్డి, రెండేళ్లలో రంగారెడ్డి జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని తెలిపారు. జిల్లాలో 2.97 లక్షల మంది రైతులకు రూ.722 కోట్ల రైతు భరోసా అందించామని, రైతు బీమా పథకం కింద 735 మంది రైతు కుటుంబాలకు రూ.367 కోట్ల





ఆర్థిక సాయం మంజూరు చేసినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాలో 16,050 ఇళ్లు మంజూరు చేసి రూ.22 కోట్ల నిధులు విడుదల చేశామని వెల్లడించారు. అలాగే లక్షా ఆరు వేల కొత్త రేషన్ కార్డుల ద్వారా మూడు లక్షల 52 వేల మందికి లబ్ధి చేకూరిందని, 1.91 లక్షల మంది లబ్ధిదారులకు ఆసరా పింఛన్లు అందుతున్నాయని పేర్కొన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా జిల్లాలో 203 కోట్ల టికెట్లు జారీ చేసి ప్రభుత్వం రూ.977 కోట్ల భారం భరిస్తోందని తెలిపారు. ఫ్యూచర్ సిటీపై చేస్తున్న విమర్శలు అనవసరమని, రానున్న రోజుల్లో తెలంగాణను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా నిలబెట్టే ప్రాజెక్ట్ ఇదేనని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, మార్చి 6 నుంచి ప్రారంభమైన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో సాధించిన పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రజా సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల వేగవంతం, రెండు పడక గదుల ఇళ్ల పారదర్శక కేటాయింపు, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాలకు ఆర్థిక ప్రోత్సాహం వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఇందిరా మహిళా శక్తి సంఘాలకు బ్యాంకు రుణాల చెక్కులు, కళ్యాణ లక్ష్మి--షాదీ ముబారక్ పథకాల చెక్కులు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్థిక సహాయ చెక్కులు పంపిణీ చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాశ్ గౌడ్, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అధిక మాసం సందర్భంగా పేదలకు అల్పాహార పంపిణీ

● కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం







**ఎల్.బి.నగర్ మే22 (నేటి దర్శిని) :** అధిక మాసం పురస్కరించుకుని కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో పేదల బస్తీలో అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఢిల్లీకి చెందిన శ్రీమతి తానియా రహేజా సహకారంతో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమంలో సుమారు 200 నుండి 250 మంది చిన్నారులు, వృద్ధులు పాల్గొని అల్పాహారాన్ని స్వీకరించారు. "మానవ సేవయే మాధవ సేవ" అనే మహోన్నత సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమం సేవా భావాన్ని ప్రతిబింబించిందని సమితి సభ్యులు తెలిపారు. సమాజంలోని అవసరమైన వారికి సహాయం చేయాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు, నిర్వాహకులు, స్వచ్ఛంద సేవకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, పుణ్యతిథులు వంటి ప్రత్యేక సందర్భాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు రావాలని కోరారు. సేవా కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు కృష్ణ గోపాల్ సేవా సమితిని సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు. సంప్రదించవలసిన నంబర్ : 8106876999

# రైతన్నల జీవితాలు అంధకారం

## ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నిరసన





**దేవరకొండ, మే 22 (నేటి దర్శిని):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతన్నల పరిస్థితి దయనీయంగా మారిందని పీఏసీఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్ర కుమార్ పిలుపు మేరకు శుక్రవారం దేవరకొండ మండలం కొండ భీమనపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను సక్రమంగా నిర్వహించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు సరిపడా లారీలు అందుబాటులో లేకపోవడంతో వడ్లు రోజుల తరబడి పేరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతన్నలను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ, సర్పంచులు పల్లా శ్రీకాంత్ రెడ్డి, ఆడరాపు హరికృష్ణ, తోటకూరి వెంకటయ్య, ఉపసర్పంచ్ కడారి సైదులు, ముదిగొండ సంజీవ, అప్పనాల తిరుమల్, గుండాల వెంకట్, ఇటుకల రాజు, బొడ్డుపల్లి ఏడుకొండలు, కడారి అచ్చయ్య, జక్కుల అంజి, కడారి శ్రీను, జబ్బు ఉమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం కొనుగోలు కేంద్రం వద్ద నిరసన దేవరకొండ మండలం కమలాపురం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో మరో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లాల్లో ధాన్యం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతు వ్యతిరేక పాలనకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, రైతుల పక్షాన పోరాడుతున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి రవీందర్ రెడ్డి, రేపాని ఇద్దయ్య, జైహింద్ రెడ్డి, యాదయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు లోని రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు....



**ఆమనగల్లు, మే 22(నేటి దర్శిని):** "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు"అనే కార్యక్రమాన్ని పట్టణంలోని రైతు వేదికలో శనివారం నిర్వహిస్తారని ఇట్టి కార్యక్రమాన్ని రైతులు వినియోగించుకోవాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ యూనివర్సిటీ నుంచి శాస్త్రవేత్తలు రాబోయే వాన కాలంలో సాగు చేసే పంటల్లో సమస్యలకు సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని రైతులందరూ హాజరై విజయవంతం చేయాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ అన్నారు.

RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక

## సరస్వతి అంత్య పుష్కరాలకు
# ప్రత్యేక బస్సులు

- దేవరకొండ డిపో నుంచి కాళేశ్వరం యాత్ర
- భక్తులు అవకాశాన్ని వినియోగించుకోవాలి : డిపో మేనేజర్ విజయకుమారి



**దేవరకొండ, మే 22 (నేటి దర్శిని):**
సరస్వతి అంత్య పుష్కరాలను పురస్కరించుకొని దేవరకొండ ఆర్టీసీ డిపో నుంచి కాళేశ్వరం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక డీలక్స్ బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ విజయకుమారి తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. జూన్ 1వ తేదీ వరకు కనీసం 30 మంది భక్తులు ముందస్తుగా బుకింగ్ చేసుకున్నచో ప్రత్యేక బస్సు సర్వీసును నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ యాత్రలో కాళేశ్వరం పుష్కర స్నానం, ముక్తేశ్వర స్వామి దేవాలయం, ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు. పెద్దలకు రూ. 1600, పిల్లలకు రూ. 1000 చార్జీలు నిర్ణయించినట్లు వెల్లడించారు. దేవరకొండ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
మరిన్ని వివరాలకు 9848847149, 9666599890, 949026631, 9652999240 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## బంజారా దైవం శ్రీ మైరమ్మ యాడి ఆలయ నిర్మాణానికి రూ.1,00,116 విరాళం

- వడ్త్య రమేష్ నాయక్‌కు తండ వాసుల ఘన సత్కారం





**దేవరకొండ చందంపేట, మే 22 (నేటి దర్శిని):**
చందంపేట మండలం పోలేపల్లి గ్రామ పరిధిలోని మానవత్ తండలో నూతనంగా నిర్మించనున్న బంజారా దైవం శ్రీ శ్రీ మైరమ్మ యాడి ఆలయాన్ని బీఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్ సందర్శించారు. తండ వాసుల ఆహ్వానం మేరకు ఆలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ఆయనను గ్రామ ప్రజలు గౌరవంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి తమ వంతు సహాయం అందించాలని గ్రామస్తులు కోరగా, వడ్త్య రమేష్ నాయక్ స్పందిస్తూ నూతన దేవాలయ నిర్మాణానికి రూ. 1,00,116 ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. దీంతో తండ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సాయి రాథోడ్, మానవత్ తండా సర్పంచ్ కవిత-హర్యా నాయక్, బీఆర్ఎస్ నాయకులు పోలేపల్లి మాజీ సర్పంచ్ మహేష్, చందంపేట మాజీ జడ్పీటీసీ సలహాదారులు రామావత్ మోహన్ కృష్ణ, ధర్మ నాయక్, బాలు నాయక్, గుడి పూజారి తిరుపతి, వార్డు సభ్యురాలు సబిత, పత్య నాయక్, రాజు, మహేష్, శ్రీను నాయక్, శ్రీకాంత్, లక్ష్మణ్ నాయక్, వినోద్, హేమ్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో
# బాలికల హెల్త్ క్యాంప్

**చందూరు,మే 22 (నేటి దర్శిని):**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపడుతున్న "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో 99 రోజుల కార్యచరణ ప్రణాళికల కార్యక్రమంలో స్థానిక పి .ఆర్.గెస్ట్ హౌస్ నందు మెప్మా అద్వర్యంలో "కౌమార బాలికలు 15 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలు హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, హెల్త్ క్యాంపును ప్రారంభించారు. మున్సిపల్ కమీషనర్ ఎల్ మల్లేశం, మాట్లాడుతూ మానవ వికాస దశల్లో కౌమార దశ అతి ముఖ్యమైనదని, శారీరక మానసిక మార్పులు జరిగే దశగా చెప్పటమైంది. ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగి ఉండాలని పేర్కొనటమైంది. తగు సూచనలు చేశారు.





ఇట్టి కార్యక్రమముకు చైర్ పర్సన్ డా. కోడి శ్రీనివాసులు, మున్సిపల్ కమీషనర్ ఎల్. మల్లేశం, వైస్ చైర్ పర్సన్ భూతరాజు దశరథ , కౌన్సిలర్స్, కో ఆప్షన్స్ సభ్యులు , పాల్గొన్నారు.డా. జెస్సి , మెప్మా టిఎంసి ఎన్. సరిత , ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, ఆర్.పి లు తదితరులు పాల్గొన్నారు.

## ఎత్తైన ప్రాంతాలకు శాశ్వత సాగునీరు అందించడమే
# లక్ష్యం: ఎమ్మెల్యే డాక్టర్. పల్లా రాజేశ్వర్ రెడ్డి

- కేసీఆర్ హయాంలోనే తరిగొప్పుల లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూపకల్పన
- బి ఆర్ఎస్ ప్రభుత్వ హయాం లోనే రూ.110 కోట్లతో తరిగొప్పుల లిఫ్ట్ మంజూరు
- జూలై 15లోపు ఎత్తైన ప్రాంతాలకు నీళ్లు అందేలా చర్యలు
- దేవాదుల తరిగొప్పుల లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, మే 22 ( నేటి దర్శిని బ్యూరో):**
జనగామ నియోజకవర్గం తరిగొప్పుల మండలం గండీరామారం పంప్ హౌస్ వద్ద కొనసాగుతున్న దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ఫేజ్-1 పనులను శుక్రవారం జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి పరిశీ లించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు, ఇంజినీర్లతో కలిసి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతంగా పూర్తి చేసి రైతులకు త్వరితగతిన సాగునీరు అందిం చాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతాంగ సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకున్న అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఎత్తైన ప్రాంతాలకు శాశ్వత సాగునీరు అందించేందుకు ప్రత్యేకప్రణాళిక రూపొందించిందన్నారు. జనగామ, హన్మకొండ జిల్లాల్లోని తరిగొప్పుల, చిలుపూ ర్, ధర్మసాగర్, వేలేరు, మండలాలకు సాగునీటి పరిష్కారం కల్పించేందుకు రూ. 110 కోట్లతో మూడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను మంజూరు చేయించామని తెలిపారు. తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలోనే అప్పటి సీఎం కెసిఆర్ తో కలిసి తరిగొప్పుల లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ. 110 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించుకున్నామని తెలిపారు. దేవాదుల పైపులైన్ ఆధా రంగా మూడు మినీ ఎత్తిపోతల పథకాలను రూపకల్పన చేసి వేలాది ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక సిద్ధం చేశామని, ఈ పనులకు 2023 ఫిబ్రవరి 27న అప్పటి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. తరిగొప్పుల మండలాన్ని సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో గండీరా మారం రిజర్వాయర్ ఆధారంగా రూ. 63.80 కోట్లతో లిఫ్ట్-1 ఇరిగేషన్ పథకాన్ని చేపట్టామని ఎమ్మెల్యే వివరించారు. ఈ లిఫ్ట్ ద్వారా తరిగొ ప్పుల, అబ్దుల్ నాగారం, నర్సాపూర్, అంకుషాపూర్, సోలిపురం, పోతా రం, బొత్తగట్టు నాగారం, భోజ్య తండా, జల్వాయి తండా, మానిసింగ్ తండా తదితర గ్రామాలు, తండాలకు సాగునీరు అందనున్నట్లు తెలిపారు. తొలి దశలో 4వేల ఎకరాలకు నీరు అందుతుందని, భవి ష్యత్తులో మరో 10 వేల ఎకరాలకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. పంపు హౌస్ వరకు అప్రోచ్ కాలువ పనులు కొనసా గుతున్నాయని, మరో రెండు నెలల్లో మొత్తం పనులు పూర్తి అవుతాయని ఇంజినీర్లు చెబుతున్నారని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జూన్ 30లోపు నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. తాను కూడా ఇంజినీర్లు, కాంట్రాక్టర్లను జూలై 15 లోపు తరిగొప్పులలో ఇప్పటివరకు సాగునీరు అందని ఎత్తైన ప్రాంతా లకు కూడా నీళ్లు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తరిగొప్పుల మండలానికి నీళ్లు తీసుకురావడం తన అదృష్టంగా భావి స్తున్నానని ఎమ్మెల్యే అన్నారు. ఈ పనుల కోసం నిరంతరం అధికా రులతో, ఏజెన్సీలతో సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి ఈ అంశంపై చర్చిస్తున్నా మని, అసెంబ్లీలో కూడా ఈ సమస్యను ప్రస్తావించి రిప్రజెంటేషన్ ఇచ్చామని వెల్లడించారు. గండి రామారం పంపు హౌస్ కు పోయే క్రమంలో గ్రామాల్లో వేసిన పైప్ లైన్ ను పరిశీలించడం, ఈ స్కీమ్ లో నీళ్లు చేరని కుంటలకు కూడ పరి శీలించాలని అధికారులకు తెలియచేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తరిగొప్పుల బిఆర్ఎస్ మండల నాయకులు పింగిలి జగన్మో హన్ రెడ్డి, మాజీ జడ్పి చైర్మన్ పద్మ నర్సింగ రావు, బిఆర్ ఎస్ నాయకులు పెద్ది రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ పద్మజ వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జూంలాల్, మాజీ అధికార ప్రతినిధి లింగం, తరిగొప్పుల మాజీ సర్పంచ్ ప్రభుదాస్, అబ్దుల్ నాగారం మాజీ సర్పంచ్ రమ సంపత్ రెడ్డి, సోలిపురం సర్పంచ్ శ్రీను, నర్మెట సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు కంతి ఆంజనే యులు, బొత్తల పల్లె సర్పంచ్ రవి నాయక్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు కళ్లల్లో కన్నీరు ఆగడం లేదు






- వరి కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్ఎస్ నిరసన
- రైతుల పక్షాన పోరాడుతున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ : ఉలుపాల శేఖర్ రెడ్డి

**చింతపల్లి, మే 22 (నేటి దర్శిని):**
రైతుల కష్టాలు ప్రభుత్వానికి కనిపించడం లేదని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి విమర్శించారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న ఇబ్బందులపై బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు చింతపల్లి మండలం తీదేడు వరి కొనుగోలు కేంద్రం వద్ద గ్రామ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళ్లాల్లో ధాన్యం కొనుగోలు సక్రమంగా జరగక రైతుల కళ్లల్లో కన్నీరు ఆగడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. రైతు బతికితేనే రాష్ట్రం బతుకుతుందని, రైతు వ్యతిరేక పాలనకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రైతుల పక్షాన నిరంతరం పోరాడుతున్న ఏకైక పార్టీ బీఆర్ఎస్ పార్టీయేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధేన్యతండ గ్రామ సర్పంచ్ రమావత్ కొండల్ నాయక్, తీదేడు గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సోనగంటి గోవర్ధనాచారి, మద్రు రామారావు, ఉలుపాల పురుషోత్తం రెడ్డి, సిమర్ల శ్రీను యాదవ్, రమావత్ మాంత్య నాయక్, తిరుమణి పాపయ్య, కాయితి బచ్చిరెడ్డి, మద్రు శ్రీనివాసరావు, శివర్ల పర్వతాలు, శివర్ల రాములు, మద్రు సురేందర్ రావు, బొడ్డు చెన్నయ్య, మాదగోని కృష్ణ గౌడ్, రెడ్డి పరమేష్, వీరమల్ల వెంకటయ్య, గంటెల ఆంజనేయులు, కాయితి భగవాన్ రెడ్డి, మెరిక శంకరయ్య, ఉడుత శంకరయ్య, శివర్ల అనిల్, శివర్ల రమేష్, రమావత్ తుల్చ నాయక్, విజయ్, రాశిక మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ షాక్‌తో లారీ డ్రైవర్ మృతి...


**నిడమనూర్, మే 22 (నేటి దర్శిని):**
నిడమనూర్ మండల కేంద్రానికి చెందిన పిడుగు రాజు అనే వ్యక్తి కరెంట్ షాక్‌కు గురై మృతి చెందిన విషాద ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడు వృత్తిరీత్యా లారీ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, శుక్రవారం ఖాళీగా ఉండటంతో నిడమనూర్ చెరువు కింది భాగంలోని అలుగు కాలువ వద్ద చేపలు పడేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో కరెంట్ ఎర్త్ ద్వారా చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ వైర్ చేతికి తగలడంతో తీవ్ర షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య సాయి ప్రియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు నిడమనూర్ ఎస్సై డి. విజయ్ కుమార్ తెలిపారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.





# పెద్ది నుండి స్పెషల్ సాంగ్ హెల్లల్లలో ప్రోమో విడుదల ..

## ఫ్యాన్స్ ఫుల్ ఖుష్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది' పై రోజురోజుకీ అంచనాలు మరింత పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ క్రీడా ప్రధాన కథా చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. రేపు భోపాల్‌లో భారీ స్థాయిలో సంగీత వేడుక జరగనున్న నేపథ్యంలో చిత్రబృందం అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది. సినిమాలోని ప్రత్యేక గీతం "హెల్లల్లలో" అనే పాటకి సంబంధించిన ప్రోమో విడుదల చేశారు. ఇందులో రామ్ చరణ్, శృతి హాసన్ స్టెప్పులకి ఫ్యాన్స్‌కి మాంచి కిక్ ఇచ్చాయి. ఫుల్ సాంగ్ మార్చి 23న రానుంది.ఈ పాటకు ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ సంగీతాన్ని సమకూర్చారు. ఆయన సంగీతం అంటేనే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. అందులోనూ ఇది ప్రత్యేక గీతం కావడంతో ఈ పాటపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. రేపు జరగనున్న సంగీత వేడుకలో ఈ పాటను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఈ పాటలో ఇంకో కథానాయిక కూడా కనిపించనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో చర్చ నడుస్తోంది. అయితే ఆమె ఎవరు అన్న విషయం మాత్రం చిత్రబృందం ఇంకా రహస్యంగానే ఉంచింది. దీంతో అభిమానుల్లో ఉత్కంఠ మరింత పెరిగింది. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో శివరాజ్ కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ నిర్మిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న ఈ చిత్రం ఇప్పుడు ప్రత్యేక గీతం వార్తతో మరింత చర్చనీయాంశంగా మారింది.



## గ్లామర్ డోస్ పెంచిన మిరాయ్ బ్యూటీ..

# వినాయక చవితికి జైలర్-2 ?




'టైగర్ కా హుకుం'.. అంటూ ముత్తువేల్ పాండియన్‌గా మరోమారు బాక్సాఫీస్ బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు రజనీకాంత్. ఆయన 'జైలర్'లో ఇదే పాత్రతో అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ విజయవంతమైన సినిమాకి కొనసాగింపుగా 'జైలర్ 2' సిద్ధమైంది. నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మించింది. మోహన్‌లాల్, శివ రాజ్‌కుమార్ తదితరులు ప్రత్యేక పాత్రలు పోషించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాని వినాయక చవితి సందర్భంగా సెప్టెంబరు రెండో వారంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. దీని కోసం రెండు తేదీల్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. దీనికి తగ్గట్లే ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్ని వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. త్వరలోనే విడుదల తేదీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రానికి అనిరుధ్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తిక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరించారు.



# కోలీవుడ్‌లోకి జాన్వీ కపూర్ గ్రాండ్ ఎంట్రీ ..

## -యువ హీరోతో జత కట్టడంపై భారీ బజ్!

బాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ నటి జాన్వీ కపూర్ ఇప్పుడు దక్షిణాది చిత్రసీమలో తన ప్రస్థానాన్ని మరింత విస్తరించే దిశగా అడుగులు వేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దివంగత అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన జాన్వీ, ఇప్పటికే టాలీవుడ్‌లో దేవర, పెద్ది సినిమాలతో ప్రేక్షకులకు దగ్గరయ్యారు. ఇప్పుడు ఆమె తమిళ చిత్రసీమలోకి అడుగుపెట్టబోతున్నారనే వార్త సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది.తాజా సమాచారం ప్రకారం, విలక్షణ నటుడు విక్రమ్ కుమారుడు, యువ హీరో ధృవ్ విక్రమ్ సరసన జాన్వీ నటించే అవకాశం ఉన్నట్లు కోలీవుడ్‌లో బలమైన ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరు స్టార్ కిడ్స్ తొలిసారి ఒకే చిత్రంలో జంటగా కనిపించబోతుండటంతో ప్రాజెక్ట్‌పై అంచనాలు పెరుగుతున్నాయి.ధ్రువ్ విక్రమ్ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఆయన తదుపరి చిత్రాన్ని యువ దర్శకుడు గణేష్ కే బాబు తెరకెక్కించనున్నట్లు సమాచారం. గతంలో యూత్‌కు బాగా కనెక్ట్ అయిన రొమాంటిక్ కథలతో ఆకట్టుకున్న దర్శకుడు, ఈసారి కూడా ప్రేమ, భావోద్వేగాలు, యాక్షన్ అంశాలను కలిపిన ఒక యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కథను నేటి యువతకు దగ్గరయ్యేలా రూపొందిస్తున్నారని, ఇందులో ప్రేమకథతో పాటు బలమైన భావోద్వేగ అంశాలు కూడా ఉండనున్నాయని టాక్ వినిపిస్తోంది. జాన్వీ గ్లామర్ ఇమేజ్‌తో పాటు ధ్రువ్ నటన శైలిని దృష్టిలో పెట్టుకుని కథను డిజైన్ చేసినట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అలాగే ఈ చిత్రానికి భారీ నిర్మాణ విలువలు ఉండనున్నాయని సమాచారం. ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ ప్రాజెక్ట్‌ను గ్రాండ్ స్కేల్‌లో నిర్మించేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. విజువల్స్, మ్యూజిక్, టెక్నికల్ అంశాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా సినిమాను రూపొందించాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని టాక్.ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. స్క్రిప్ట్ ఫైనలైజేషన్, లొకేషన్ ఎంపిక వంటి పనులు చివరి దశకు చేరుకున్నాయని సమాచారం. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా ఆసక్తికర అంశం ఏమిటంటే.. ఈ సినిమాను కేవలం తమిళ భాషకే పరిమితం చేయకుండా మల్టీ-లాంగ్వేజ్ విడుదల దిశగా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. తమిళంతో పాటు తెలుగు, హిందీ భాషల్లో కూడా ఒకేసారి విడుదల చేసే అవకాశాలను మేకర్స్ పరిశీలిస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

# కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఐశ్వర్యారాయ్



సందడిగా జరిగే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఐశ్వర్యారాయ్ ఎప్పుడూ హైలైట్‌గా నిలుస్తుంటారు. అయితే ఈసారి ఆమె ఈ వేడుకకు హాజరుకావడం లేదంటూ కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. వీటికి చెక్ పెడుతూ ఈ బ్యూటీ తన కుమార్తెతో కలిసి ఫ్రాన్స్‌కు బయల్దేరారు. దీంతో కేన్స్‌లో చివరిరోజు ఐశ్వర్య సందడి చేయనున్నట్లు తెలుస్తోంది. ఒక ప్రముఖ బ్రాండ్ తరఫున ప్రతి ఏటా కేన్స్ రెడ్ కార్పెట్‌పై హొయలొలికించే ఐశ్వర్య ఈసారి ప్రచార చిత్రాల్లో కనిపించకపోవడంతో రూమర్స్ మొదలయ్యాయి. ఆమెకు బదులుగా ఈసారి బాలీవుడ్ నటి అలియా వెళ్లారంటూ కథనాలు వచ్చాయి. దీంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తాజాగా ఆమె ముంబయి ఎయిర్‌పోర్ట్‌లో కనిపించడంతో వాళ్లు సంబరపడుతున్నారు. ఈసారి ఈ కేన్స్ క్వీన్ ఎలాంటి లుక్స్‌తో మెస్మరైజ్ చేయనున్నారో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొదటిసారి 2002లో కేన్స్‌కు వెళ్లిన ఐష్.. అప్పటినుంచి ప్రతి ఏడాది తన ప్రత్యేకమైన దుస్తులతో మెరుస్తూనే ఉన్నారు. గతేడాది కూడా భారతీయత ఉట్టిపడేలా చీరతో వచ్చిన ఆమె.. నుదుటిన సింధూరంతో అందరి దృష్టిని ఆకర్షించారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు కేన్స్ వేదికగా తన లుక్‌తో మద్దతు ఇచ్చి సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచారు.

# విజయాన్ని శాసించేది ఆ మూడు మాత్రమే



నెపోటిజం గురించి చాలామంది స్టార్‌కిడ్స్ చాలా సందర్భాల్లో మాట్లాడారు. తాజాగా మహేశ్ మంజ్రేకర్ ముద్దుల తనయ సాయి మంజ్రేకర్ కూడా ఈ అంశంపై తనదైన శైలిలో స్పందించారు. సినీ పరిశ్రమలో నటవారసత్వం అనే అంశంపై ఇటీవల ఆమె మాట్లాడుతూ 'ఇంటిపేరనేది బలమైన కెరీర్‌కి గ్యారెంటీ కార్డు కాదు. అది కేవలం ప్రారంభంలో పరిచయాలకూ, తొలి సినిమా అవకాశానికి మాత్రమే సహాయపడుతుంది.జనానికి కనెక్ట్ కానప్పుడు, ఎంతటి సూపర్‌స్టార్ వారసులైనా తలదించుకొని వెనక్కెళ్లిపోవాల్సిందే. అందుకే 'మంజ్రేకర్' అనే కంఫర్ట్ జోన్ నుంచి పూర్తిగా బయటకు వచ్చి, కేవలం నా కష్టం, అంకితభావంతో ఇండస్ట్రీలో నిలబడాలనుకుంటున్నా. హార్డ్‌వర్క్, క్రమశిక్షణ, పట్టుదల.. ఈ మూడు మాత్రమే విజయాన్ని శాసిస్తాయి' అని సాయి మంజ్రేకర్ పేర్కొన్నది. 'మేజర్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన సాయి మంజ్రేకర్.. ప్రస్తుతం తెలుగు చారిత్రాత్మక పానిండియా చిత్రం 'ఇండియా హౌస్'లో కథానాయికగా నటిస్తున్నది.


Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365